


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 08 జూన్ 2021 | సంపుటి : 02 | సంచిక :321 | పేజీలు : 4 | వెల : రూ 3-00


### జగనన్న ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

చిత్తూరు జగనన్న నిర్మాణాలతో చిత్తూరు ఎమ్మెల్యే అరుణ్ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. సోమవారం చిత్తూరు నగరంలోని తిమ్మసముద్రం వద్ద జగనన్న కాలనీలో చిత్తూరు నగరపాలక సంస్థ అముద కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలందరికీ సొంత ఇంటి కల సాకారం కావాలని జగనన్న ప్రజాసంకల్పయాత్ర లో పేర్కొని ప్రస్తుత దాన్ని అమలు పరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు చిత్తూరు నియోజకవర్గంలో 12 ఎలా ఇంటి నిర్మాణాలు జరుగుతుందన్నారు. అసలైన పేదవారు ఇంటి పట్టాలు దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో మంజూరు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చూడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, హౌసింగ్ డిఈ రామస్వామి రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు లోకేశ్వర్ రెడ్డి , కార్పొరేటర్ లు సహదేవన్ తదితరులు పాల్గొన్నారు.

## కరోనా థర్డ్‌వేవ్‌పై సీఎం జగన్ సమీక్ష



అమరావతి: కరోనా థర్డ్‌వేవ్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. మూడో వేవ్‌పై అనాలసిస్, డేటాలను సీఎంకు అధికారులు వివరించారు. థర్డ్ వేవ్ వస్తుందా? లేదా? అన్నదానిపై శాక్ష్మయ నిర్ధారణ లేదని ఈ సందర్భంగా సీఎం జగన్‌కు అధికారులు వెల్లడించారు. ఒకవేళ థర్డ్ వేవ్ వస్తే తలెత్తే పరిణామాలు, ప్రభావితమయ్యే వారి వివరాలపై అంచనాలను జగన్‌కి వివరించారు. పోషకాహార కార్యక్రమం కొనసాగాలని, టీకాల కార్యక్రమం కూడా కొనసాగించాలని అధికారులు కోరారు. వినియోగించాల్సిన మందులు, పరికరాలు, బయోమెడికల్ ఎక్విప్‌మెంట్, తదితర అంశాలపైనా ముఖ్యమంత్రితో అధికారులు చర్చించారు.థర్డ్‌వేవ్ వస్తే పిల్లలపై ప్రభావం, తీవ్రత ఎలా ఉంటుందనే అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం జగన్ సూచించారు. పీడియాట్రిక్ సింప్టమ్స్‌ను గుర్తించడానికి ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలన్నారు. అన్ని టీచింగ్ ఆస్పత్రుల్లో పీడియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. థర్డ్‌వేవ్ వస్తుందనుకుని కావాల్సిన మందులు ముందే తెచ్చి పెట్టుకోవాలని అధికారులకు సీఎం తెలిపారు. పిల్లల డాక్టర్లను గుర్తించాలని, వారిని రిక్రూట్ చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చిన్న పిల్లల కోసం మూడు నూతన ఆస్పత్రులు నిర్మించాలని, వాటిలో అత్యుత్తమ వైద్య సేవలు అందించడానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఒకటి వైజాగ్‌లో, రెండోది కృష్ణా-గుంటూరు ప్రాంతంలో, మూడోది తిరుపతిలో అత్యుత్తమ పీడియాట్రిక్ కేర్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. దాదాపు రూ.180 కోట్ల చొప్పున ఒక్కో ఆస్పత్రి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సీఎం జగన్ ఆదేశించారు.

## ఈ శతాబ్దంలోనే ఇది అత్యంత ఘోరమైన విషాదం: మోదీ



న్యూఢిల్లీ : కరోనా వైరస్ గడిచిన వందేళ్లలో వచ్చిన అతిపెద్ద మహమ్మారని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గతంలో ఇలాంటిది చూడలేదని, అనుభవించలేదని చెప్పారు. ఈ శతాబ్దంలోనే ఇది అత్యంత ఘోరమైన విషాదం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం సెకండ్ వేవ్ తర్వాత మొదటి సారి ఆయన జాతినుద్దేశించి ప్రసంగిస్తున్నారు. ఈ సందర్భంగా.. “ కరోనా వచ్చిన తర్వాత దేశంలో వైద్య రంగాన్ని బలోపేతం చేశాం. రెండో వేవ్ వచ్చిన తర్వాత ఆక్సిజన్ డిమాండ్ విపరీతంగా పెరిగింది. గతంలో ఎప్పుడూ ఇలాంటి డిమాండ్ రాలేదు. విమానాలు, రైళ్ల ద్వారా ఆక్సిజన్ సరఫరా చేశాం. కోవిడ్ నిబంధనలను అందరూ పాటించాలి. మాస్క్, భౌతిక దూరం పాటించాలి. వ్యాక్సిన్ రక్షణ కవచం లాంటిది. వ్యాక్సిన్ తయారు చేసే సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా తక్కువగా ఉన్నాయి. విదేశాల నుంచి వ్యాక్సిన్ తెచ్చుకోవటం కఠినతరంగా ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. దేశంలో వందశాతం వ్యాక్సినేషన్‌కు ప్రణాళికలు రూపొందించాం. ఇందుకోసం మిషన్ ఇంద్రధనస్సును రూపొందించాం.ఇప్పుడు వ్యాక్సినేషన్ వేగవంతంగా జరుగుతోంది. వ్యాక్సినేషన్ వేగవంతం చేసే సమయంలోనే రెండో వేవ్ వచ్చింది. రెండు మేడిన్ ఇండియా వ్యాక్సిన్లను ప్రారంభించాం. కరోనాను ఎదురిస్తామనే విశ్వాసం అందరికీ ఉండాలి. తక్కువ సమయంలోనే మన శాస్త్రవేత్తలు సఫలమయ్యారు. 23 కోట్ల మందికి ఇప్పటి వరకు వ్యాక్సినేషన్ వేశాం. వ్యాక్సిన్ టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేశాం. వ్యాక్సిన్ తయారు చేసే సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. మౌలిక సదుపాయాలతోపాటు భారీగా నిధులు కూడా కేటాయిస్తాం వవ అని అన్నారు.

## భారత్ లో క్రమేనా తగ్గుతున్న కరోనా కేసులు



న్యూ ఢిల్లీ జూన్ 7 ఒకప్పుడు నాలుగు లక్షలకి పైగా నమోదు అయిన కరోనా కేసులు ప్రస్తుతం లక్ష కి వచ్చాయి. అలాగే కరోనా మహమ్మారి మరణాలు కూడా తగ్గుతూ వస్తున్నాయి. దేశంలో మరణాల రేటు 1.2 శాతంగా ఉంది. ప్రపంచ దేశాల్లో ఇది 2.15 శాతంగా ఉంది.గడిచిన 24 గంటల్లో ఇండియాలో కరోనాతో 2427 మంది మృతిచెందారు. దీనితో ఇండియాలో ఇప్పటి వరకు కరోనాతో మృతి చెందిన వారి సంఖ్య 349186 కి చేరింది. ఇక ఇదిలా ఉంటే గడిచిన 24 గంటల్లో కరోనా నుంచి 174399 మంది కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. కాగా దేశంలో ఇప్పటి వరకు మొత్తం 232786482 మందికి వ్యాక్సిన్ అందించారు. ఇండియాలో తాజాగా 174399 మంది కరోనా నుంచి కోలుకున్నారు. మొత్తం రికవరీల సంఖ్య 27159180కి చేరింది. రికవరీ రేటు 93.7 శాతం నుంచి 93.9 శాతానికి పెరిగింది. ప్రస్తుతం భారత్లో 1401609 యాక్టివ్ కేసులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా కొత్తగా 1587589 టెస్టులు చేశారు. భారత్లో ఇప్పటివరకు 36 కోట్ల 63 లక్షల 34 వేల 111 టెస్టులు చేశారు. కొత్తగా 1390916 మందికి వ్యాక్సిన్లు వేశారు. ఇప్పటివరకు 23కోట్ల 27లక్షల 86వేల 482 మంది వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఇండియాలో ఇప్పటివరకు ఇండియాలో నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 28909975 కి చేరింది.

## ఏడు రా(ష్ట్రాల్లో వెయ్యి కన్నా తక్కువ కరోనా కేసులు : కేంద్రమంత్రి




న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ సహా ఏడు రా(ష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు వెయ్యి కన్నా తక్కువగా ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ అన్నారు. సోమవారం ఆయన దేశంలో కొవిడ్ పరిస్థితిపై మంత్రుల బృందం సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ, మధ్యప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, జార్ఖండ్‌లో వెయ్యికన్నా దిగువన ఉన్నాయన్నారు. వైరస్ యాక్టివ్ కేసులు సోమవారం నాటికి దేశంలో 14,01,609 ఉన్నాయని చెప్పారు. జాతీయ రికవరీ రేటు నిరంతరం పెరుగుతుందని చెప్పారు. యాక్టివ్ కేసుల్లో 80శాతం పది రా(ష్ట్రాల్లోనే ఉన్నాయని, మిగిలిన 17 శాతం 26 రా(ష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్నాయని తెలిపారు. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్‌లో రెండువేల కన్నా తక్కువగా వైరస్ కేసులున్నాయన్నారు. ఎక్కువ ప్రభావితమైన రా(ష్ట్రాల్లో మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటకలో కేసుల సంఖ్య తగ్గుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా.. 24 గంటల్లో 1,00,636 కొత్తగా కరోనా కేసులు వెలుగు చూడగా.. 1,74,399 మంది బాధితులు కోలుకున్నారు. మరో 2,427 మంది వైరస్ బారినపడి మృతి చెందారని ఆరోగ్యశాఖ తెలిపింది. ప్రస్తుతం దేశంలో 14,01,609 క్రియాశీల కేసులున్నాయని పేర్కొంది.

## ఏపి లో ఈ నెల 20 వరకు కర్ఫ్యూ పొడిగింపు



అమరావతి జూన్ 7 ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారిని కట్టడి చేయడానికి విధించిన కర్ఫ్యూను ప్రభుత్వం మరోమారు పొడిగించింది. ఈ నెల 20 వరకు కర్ఫ్యూను పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న కర్ఫ్యూ గడువు ఈ నెల 10తో ముగుస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎం జగన్ మరో పది రోజులపాటు కర్ఫ్యూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.అయితే కర్ఫ్యూ సడలింపు సమయంలో కూడా ప్రభుత్వం మార్పులు చేసింది. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజలు తమ వివిధ అవసరాలు తీర్చుకోవడానికి అవకాశం కల్పించింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రభుత్వ కార్యాలయాలు నడవనున్నాయి. రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పగటిపూట కర్ఫ్యూ విధించింది. మే 31తో గడువు ముగియడంతో జూన్ 10 వరకు కర్ఫ్యూను పొడిగించిన విషయం తెలిసిందే.

## ఆనందయ్య 'కే మందు పంపిణీకి ఏపీ హైకోర్టు అనుమతి




అమరావతి : నెల్లూర్ జిల్లా కృష్ణపట్నానికి చెందిన నాటు వైద్యుడు ఆనందయ్య కరోనా నివారణకు తయారు చేసిన మందుల్లో ఒకటైన 'కేవ మందు పంపిణీకి సైతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. కరోనా బాధితులకు తక్షణమే ఈ మందు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంటి చుక్కల మందుకు సంబంధించి 2 వారాల్లో నివేదిక ఇవ్వాలని సూచించింది. మందు పంపిణీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆనందయ్య వేసిన పిటిషన్‌పై ఇవాళ హైకోర్టు విచారణ జరిపింది. ఈ మేరకు ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు కే మందు పంపిణీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆనందయ్య ఇతర మందులకు హైకోర్టు ఆదేశాలతో అనుమతిచ్చిన ఏపీ ప్రభుత్వం కంట్లో వేసే చుక్కల మందుకు మాత్రం అనుమతి ఇవ్వలేదు. ఆయూష్ నివేదికకు సంబంధించి పూర్తి వివరాలు రాని నేపథ్యలో అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే.

## ఏపీలో కొత్తగా 4,872 పాజిటివ్ కేసులు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కరోనా పాజిటివ్ కేసులు తగ్గు ముఖం పట్టాయి. గడిచిన 24 గంటల్లో కొత్తగా 4,872 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 86 మంది చనిపోయారు. గత 24 గంటల్లో 13 వేల 702 మంది బాధితులు కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,14,510 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. నిన్న ఒక్కరోజే 64 వేల మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. కరోనాతో చిత్తూరు జిల్లాలో 13 మంది, గుంటూరు జిల్లాలో 10, శ్రీకాకుళంలో 9, విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఏడుగురు చొప్పున మరణించారు.

## కేంద్రం పరిశీలనలో టీకాల సేకరణ కేంద్రీకృతం !!

న్యూఢిల్లీ: కరోనా వ్యాక్సిన్ల సేకరణను కేంద్రీకృతంగా చేపట్టాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అధికంగా వ్యాక్సిన్లు వృధా అవుతున్నాయని, వ్యాక్సినేషన్ జాప్యం అవుతుందన్న విపక్ష పాలిత రా(ష్ట్రాల విమర్శల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.కేంద్రీకృతంగా వ్యాక్సిన్ల సేకరణను మేం తీవ్రంగా పరిశీలిస్తున్నాం అని ఆమె చెప్పినట్లు తెలుస్తున్నది. వ్యాక్సిన్ల సేకరణకు గ్లోబల్ టెండర్లు పిలిచిన రాష్ట్ర ప్రభుత్వాల బిడ్లకు స్పందన లేకపోవడంతోపాటు అత్యధిక విపక్ష పాలిత రా(ష్ట్రాలు కేంద్రాన్నే వ్యాక్సిన్లు సేకరించాలని కోరుతున్నాయి.ఇటీవలే కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్‌కు ఒడిశా ఆరోగ్యశాఖ మంత్రి నబా కిశోర్ దాస్ లేఖ రాస్తూ కేంద్రమే వ్యాక్సిన్లు సేకరించాలని నొక్కి చెప్పారు. నబా కిశోర్ దాస్ డిమాండ్‌కు కేరళ, జార్ఖండ్‌తోపాటు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇందుకు మద్దతు వచ్చింది.చర్చల ద్వారా చౌక ధరకు వ్యాక్సిన్లు సేకరించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈ నెల ఆరో తేదీ నాటికి రా(ష్ట్రాలు 246 మిలియన్ల వ్యాక్సిన్లు అందుకున్నాయి. సుమారు వాటి వద్ద 16.3 మిలియన్ల డోస్‌లు సిద్ధంగా ఉన్నాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో కేంద్రం వ్యాక్సినేషన్ కోసం రూ.35 వేల కోట్లు కేటాయించింది. అవసరమైతే మరిన్ని నిధులు కేలాయిస్తామని విత్త మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.18 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరికీ మే ఒకటో తేదీ నుంచి మూడో దశ వ్యాక్సినేషన్ చేపడతామని గత ఏప్రిల్ 19వ తేదీన కేంద్రం ప్రకటించింది. ఈ ప్లాన్ కింద 50 శాతం దేశీయ వ్యాక్సిన్లు సేకరించాల్సి ఉంటుంది. 45 ఏండ్లు దాటిన వారికి కేంద్రమే వ్యాక్సినేసన్ చేస్తుంది.25 శాతం 18-44 ఏండ్ల మధ్య వయస్కులకు రాష్ట్రప్రభుత్వాలు, మిగతా 25 శాతం ప్రైవేట్ దవాఖానాలు వ్యాక్సినేషన్ చేయాలని కేంద్రం ప్రకటించింది. గ్లోబల్ సప్లయర్ల నుంచి వ్యాక్సిన్లు సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం స్వేచ్ఛనిచ్చింది.

## ప్రశ్నిస్తే కేసులు...ఎదిరిస్తే సంకెళ్లు: యనమల

అమరావతి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన అవినీతిని ప్రశ్నిస్తే కేసులు, ఎదిరిస్తే సంకెళ్లు అన్నట్లుగా సాగుతోందని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ కోర్టు ఆదేశాలకు భిన్నంగా ఆనందయ్య మందు పంపిణీలో వైసీపీ నేతలు జోక్యం చేసుకుంటున్నారని అన్నారు. ఆనందయ్య అనుమతి లేకుండా వెబ్ సైట్ సృష్టించి కోట్లు కొల్లగొట్టాలని ప్లాన్ చేశారని...దీనిని ప్రశ్నించినందుకే మాజీమంత్రి సోమిరెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. ఆనందయ్య మందును సొమ్ము చేసుకోవడానికి వైసీపీ నేతల పాట్లు హేయమన్నారు. ఇప్పటికే చంద్రగిరిలో చెవిరెడ్డి సీఎం లేబుల్‌తో మందు తయారీ మొదలెట్టారని తెలిపారు. ఆనందయ్య మందుకు నకిలీలు సృష్టించి కోట్లు దండుకునేందుకు ప్లాన్ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళపై కొవిడ్ నిబంధనల పేరుతో మరో అక్రమకేసు బనాయించారన్నారు. విశాఖలో మానసిక వికలాంగుల స్థలాన్ని కబ్జా చేసేందుకు అధికార పార్టీ నేతల యత్నిస్తున్నారని ఆరోపించారు. చరిత్రలో హిట్లర్ లాంటి నియంతలే కాలగర్భంలో కలిసిపోయారని గుర్తుచేశారు. జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనపై జనం తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు.



# సంపాదకీయం

మంగళవారం 08 జూన్ 2021

## కాంగ్రెస్ కు ఊపిరి పోస్తా :: పి.కె.

ఒక్కో సందర్భంలో అవకాశం తొంగి చూస్తుంది. అపాయమూ పొంచి ఉంటుంది. ఆచితూచి వ్యవహరించి అవకాశాన్ని అందిపుచ్చుకుంటే కష్టాల నుంచి గట్టెక్కవచ్చు. అధికారానికి బాటలు వేసుకోవచ్చు. ప్రస్తుతం కాంగ్రెసు పార్టీకి అవకాశమూ, అపాయమూ రెండు కలగలిసి కనిపిస్తున్నాయి. 2014 నుంచి ప్రారంభమైన పార్టీ పతనం తాజాగా సాగిన అయిదు రాష్ట్రాల ఎన్నికలతో పతాక స్థాయికి చేరింది. దీంతో సొంతంగా అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ అధిష్ఠానం లోకువై పోయింది. అగ్రనాయకత్వం మాటలను పెడచెవిన పెట్టి తమకు గిట్టని వారిని పూర్తిగా అణచివేసేందుకు ముఖ్యమంత్రులు స్వయంగా పూనుకుంటున్నారు. దీని ప్రభావం పార్టీలో తీవ్రస్థాయి అసమ్మతికి దారి తీస్తోంది. ఈ సందర్భాన్ని ఏఐసీసీనాయకత్వం సద్వినియోగం చేసుకుంటే కాంగ్రెసు పార్టీ ప్రక్షాళన సాధ్యమవుతుంది. ఒకవేళ బ్యాలెన్స్ తప్పితే ఆయా ప్రభుత్వాలు కుప్పకూలే ప్రమాదమూ ఉంది.నాయకులు తల ఎగరవేసే ధోరణి కాంగ్రెసులో ఈ రోజు కొత్త కాదు. ఐరన్ లేడీ ఇందిరాగాంధీకే ఈ సమస్య తప్పలేదు. జనతాపార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెసు పాలించేది. అప్పట్లో రాష్ట్ర పర్యటనకు వచ్చిన అధినేత్రికి కనీస మన్నన దక్కకుండా అప్పటి కాంగ్రెసు ముఖ్యమంత్రి వ్యవహరించారనేది పార్టీలో ఇప్పటికీ చెప్పుకుంటారు. తాజాగా పంజాబ్, రాజస్తాన్, ఛత్తీస్ ఘడ్ ముఖ్యమంత్రులు కూడా అధినేత్రి సోనియా గాంధీని చిన్న చూపు చూస్తున్నారనేది పార్టీ వర్గాల సమాచారం. ముగ్గురు ముఖ్యమంత్రులనూ అసమ్మతి వెంటాడుతోంది. సీఎం ల నియంతృత్వ ధోరణి ఇందుకు కారణమనేది ఎక్కువ మంది అంగీకరిస్తున్న సత్యం. అయినా వారు లెక్క చేయడం లేదు. సమన్వయంతో పనిచేయమని అగ్రనాయకత్వం చెబుతుంటే ముఖ్యమంత్రులు బేఖాతరు చేస్తున్నారు. దీనిని అధిష్టానం ఎలా డీల్ చేస్తుందన్నదే ప్రశ్న. నిజానికి ముగ్గురు ముఖ్యమంత్రులు పాత తరానికి ప్రతినిధులే . అమరీందర్ సింగ్, అశోక్ గెహ్లాట్, భూపేశ్ బాఘెల్ ముగ్గురూ తాము పట్టిన కుందేటి కి మూడే కాళ్లంటున్నారు. అసమ్మతిని అదుపు చేయడమో , లేదా సొంత ముఖ్యమంత్రులపైనే చర్యలకు ఉపక్రమించడమో చేస్తే తప్ప ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెసు పార్టీ వ్యవహారాలు చక్కబడేలా కనిపించడం లేదు.ఏపార్టీకి అయినా పవర్ లో లేని సమయం పరీక్షా కాలం. అధికారంలో ఉంటే అంతా మాట వింటారు. లేకపోతే తోక జాడిస్తారు. ఇప్పుడు జరుగుతున్నది అదే. కాంగ్రెసు పార్టీకి ఇంతకంటే పోయేదేమీ లేదు. కఠినంగా వ్యవహరించి కట్టుతప్పిన వారిపై వేటు వేయడం మొదలు పెట్టాలని కాంగ్రెసు వాదులు కోరుకుంటున్నారు. అప్పుడే పార్టీ శ్రేణులకు స్పష్టమైన సందేశం పంపినట్లవుతుంది. ఇటువంటి వ్యవహారాల్లో ఇందిర చాలా దృఢంగా వ్యవహరించేవారు. కాంగ్రెసు సీనియర్ నాయకుల సిండికేట్ ను ఆమె ఒంటి చేత్తో తుత్తునియలు చేశారు. ఆ తర్వాత పార్టీలో ఎన్ని వర్గాలున్నా ఆమె మాటను జవదాటే పరిస్థితి ఉండేది కాదు. ఆ స్ఫూర్తిని తీసుకుంటూ పార్టీలో పునర్వ్యవస్థీకరణకు పూనిక వహించాలనేది పార్టీలో వినవస్తున్న డిమాండ్. పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ పెద్ద నాయకుడే కానీ వృద్ధతరం. తానే చెప్పినట్లు ఇదే అతని చివరి పదవీకాలం కావచ్చు. ఇంకా పార్టీలో పాత తరంపైనే ఆధారపడి గెలవాలనుకోవడం అత్యాశ. అలాగే రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ కూడా పాత తరం ప్రతినిధే. నూతన నిర్మాణం కోసం త్యాగాలు చేసేందుకు వారిరువురూ సిద్దంగా లేరు. పైపెచ్చు తమకు పోటీదారులు అనుకున్నవారిని అణచివేసే యత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇక ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ సైతం సహచర మంత్రి దేవ్ సింగ్ తో గిల్లికజ్జాలతో అధిష్ఠానాన్ని చికాకు పరుస్తున్నారు. అధిష్టానం చూస్తూ ఊరుకుంటే పరిస్తితి చేజారిపోవచ్చు. వీరితో పడలేని వారంతా బీజేపీ, ఇతర ప్రత్యర్థి పార్టీలను ఆశ్రయిస్తే కాంగ్రెసులో ఎదగాల్సిన భవిష్యత్ నాయకులకు కొరత ఏర్పడుతుంది.ఇతర పార్టీల నుంచి కాంగ్రెసుకు ఇప్పుడిప్పుడే సంకేతాలు వస్తున్నాయి. 2024 నాటికి ఎన్డీఏకు వ్యతిరేకంగా బలమైన కూటమి నిర్మించేందుకు అంతా కలవాలనే ప్రతిపాదనలు మొగ్గ తొడుగుతున్నాయి. అయితే నాయకత్వ బాధ్యత కాంగ్రెసుకు అప్పగించేందుకు కొన్ని సమస్యలున్నాయి. ప్రతిపక్షాల్లో ఉన్న మమత, పవార్ వంటి నాయకులు ఈ సందర్భాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలని చూస్తున్నారు. కాంగ్రెసును వేదికగా వాడుకోవాలని భావిస్తున్నారు. కానీ ఆ పార్టీకి సారథ్యం ఇవ్వాలనుకోవడం లేదు. బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడే జట్టుకు అనుసందాన కర్తగా కాంగ్రెసు ఉంటే చాలనుకుంటున్నారు. దీనికి కాంగ్రెసు అధిష్ఠానం త్యాగాలకు సిద్దం కావాలి. ముందుగా పార్టీని బలోపేతం చేసుకుంటే మిగిలిన పార్టీలు కాంగ్రెసు చుట్టూ చేరకతప్పదు. 2023నాటికైనా పార్టీ పూర్తిగా ప్రక్షాళన చేసుకుని రాష్ట్రాల్లోనూ యువనాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోగలిగితే కాంగ్రెసుతో జత కూడేందుకు ప్రాంతీయ పార్టీలు ఉత్సాహ పడతాయి. ఏదేమైనా ప్రతిపక్సంలో ఉన్నప్పుడు అధికారిక బాధ్యతలు ఉండవు. సాహసిస్తే పార్టీ పునర్నిర్మాణానికి ఇదే సరైన సమయం. ఇందిరాగాంధీ తన కాలంలో ఇటువంటి సాహసోపేత నిర్ణయాలకు పెట్టింది పేరుగా నిలిచారు. అనేక మంది పెద్ద నాయకులను పక్కన పెట్టి తన విధేయులకు పీఠం వేశారు. పక్కాగా ఫలితాలనూ రాబట్టారు.

# టీడీపీలో జూలై 23 టెన్షన్

విజయవాడ, జూన్ 7, (న్యూస్ పల్స్)లుగుదేశం పార్టీకి గడచిన రెండేళ్ళుగా అంతా బ్యాడ్ గానే ఉంది. ఏది ముట్టుకుంటే అది షాక్ కొడుతోంది. వ్యూహాలు కూడా రివర్స్ అవుతున్నాయి. అపర చాణక్యుడు అని పేరున్న చంద్రబాబు సైతం చేష్టలుడిగి చూడాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో పసుపు పార్టీ శిబిరం కూడా నిండా నిరాశతో కృంగి పోతోంది. దానికి తోడు అన్నట్లుగా వైసీపీ సర్కార్ కూడా దూకుడు చేస్తోంది. ఎవరి ఎక్కడ తోక జాడించినా అరెస్ట్ అస్త్రంతో ముందుకు వస్తోంది. ఈ దెబ్బకు తమ్ముళ్ళు అంతా సైలెంట్ అవుతున్నారు. ఇపుడున్న పరిస్థితుల్లో టీడీపీని చూస్తే ఎవరికైనా రేపటి ఎన్నికల్లో గెలుస్తుంది, మళ్ళీ గత వైభవం దక్కుతుంది అన్న ఆశలైతే పెద్దగా లేవు.ఇక వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అయితే ప్రతీ రోజూ చంద్రబాబు మీద విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆ విమర్శలకు మరింత పొలిటికల్ మసాలా జోడించారు. అదెలా అంటే 2019 మే 23 టీడీపీ కి ఘోర పరాజయం అందించిన రోజు. అది ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అలాంటిదే మరో రోజు కూడా త్వరలో రానుంది అంటూ జోస్యమే చెప్పేశారు. జూలై 23 డేట్ టీడీపీకి చీకటి రోజుగా మిగిలిపోతుందని కూడా ఆయన అంటున్నారు. ఆ రోజున టీడీపీ పతనం ఖాయమని కూడా విజయసాయిరెడ్డి గుట్టు విప్పేశారు. మరి ఆ రోజు ఏం జరుగుతుంది అన్న టెన్షన్ అయితే అపుడే తమ్ముళ్లలో మొదలైంది.వైసీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి టీడీపీకి గట్టి షాకులే తగులుతున్నాయి. తాము బడా నాయకులమని, తమ జోలికి ఎవరూ రారు అని మురిసిపోయే వారంతా ఖంగు తినేలా వరసపెట్టి అరెస్ట్ అవుతున్నారు. మరి ఇదిలా ఉంటే జూలై 23న వైసీపీ పెద్దలు ఏం చేస్తారు అన్నది రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా ఉంది. ఇప్పటికే చంద్రబాబు ఆయన కొడుకు లోకేష్ తప్ప మిగిలిన వారిని అందరినీ జగన్ సర్కార్ టచ్ చేసేసింది. ఇపుడున్న పరిస్థితుల్లో ఎవరూ అరెస్టులకు అతీతులు కారు అన్న భావన అయితే టీడీపీలో ఉంది. మరి జూలై 23న చంద్రబాబు కానీ లోకేష్ కానీ అరెస్ట్ అవుతారా అన్న మాట కూడా వినిపిస్తోంది. దానికి తగినట్లుగా తెర వెనక కసరత్తు జరుగుతోందా అన్నది కూడా చర్చగా ఉందిట.మరో వైపు చూస్తే టీడీపీలో అఫీషియల్ గా నలుగురు ఎమ్మెల్యేలు గోడ దాటేశారు. ఆ విషయం చంద్రబాబే ఒప్పుకున్నారు. ఇదే బాటలో మరి కొందరు కూడా రెడీగా ఉన్నారని అంటున్నారు. జగన్ సై అనాలే కానీ వారంతా కూడా ఫ్యాన్ నీడన సేద తీరేందుకు వస్తామని అంటున్నారు. మరి ఆ ముచ్చట కూడా మరో రెండు నెలల్లో జరుగుతుందా అన్నదే టీడీపీలో సాగుతున్న చర్చట. అంటే ఒక వైపు టీడీపీని దెబ్బ తీస్తూనే మరో వైపు అధినాయకుడు చంద్రబాబు మీద కూడా భారీ యాక్షన్ కి వైసీపీ పెద్దలు స్కెచ్ గీస్తున్నారా అన్నదే చూడాల్సిన విషయంగా ఉంది. ఏది ఏమైనా విజయసాయిరెడ్డి లాంటి వారు చెప్పారు అంటే ఎంతో కొంత నమ్మాల్సిందే. తెర వెనక జరిగేది తెర ముందుకు రావడానికి గట్టిగా రెండు నెలలు మాత్రమే సమయం ఉంది. మరి ఈలోగా ఎవరు ఏవైపుగా సర్దుకుంటారో ఎవరు అడ్డంగా బుక్ అవుతారో రాజకీయ తెర మీద చూడాల్సిందే.

# మల్బరీ రైతులకు కష్టాలు

కడప, జూన్ 7, (న్యూస్ పల్స్)పట్టు రైతును కరోనా వైరస్ పీల్చిపిప్పిచేస్తోంది. కర్ఫ్యూ, ఆంక్షలతో పెళ్లిళ్లు, వేడుకలు, పండుగలు ఇతర శుభకార్యాల నిర్వహణకు అవకాశం లేకుండా పోయింది. పట్టువస్త్రాలు, ఇతర గార్మెంట్స్ వినియోగం సగానికిపైగా తగ్గిపోయింది. ఫలితంగా రాష్ట్రంలో మల్బరీ సాగుపై ఆధారపడిన రైతుల కుటుంబాలు అప్పుల అగాధంలోకి కూరుకుపోయాయి.రాష్ట్రంలో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పెద్దఎత్తున మల్బరీ పంట సాగవుతోంది. అనంతపురం జిల్లాలో అత్యధికంగా లక్ష ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 70 వేల ఎకరాలు, కడప, కర్నూలు జిల్లాల్లో 3,500 ఎకరాల్లో మల్బరీ పంట సాగవుతోంది. ఇక్కడ సిబిఐ, బైవోల్టెన్ రకపు పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. కడప జిల్లాలో ఎకరా సాగుకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. కోతకు 250 కిలోల పట్టుగూళ్ల చొప్పున, ఐదు కోతలకు సుమారు 1,520 కిలోల పట్టు గూళ్ల దిగుబడి వస్తుంది. ప్రతి రైతుకూ సాధారణ రోజుల్లో ఏడాదికి ఐదు కోతల్లో రూ.80 వేల ఆదాయం లభించేది. మల్బరీ రైతులు గూళ్ల దశకు చేరుకున్న పట్టును తోటల్లోని షెడ్ల నుంచి స్థానిక మార్కెట్లైన మదనపల్లి, కదిరి, హిందూపురం మార్కెట్లకు తరలించేవారు. ఇక్కడికి బెంగళూరు, చెన్నై ప్రాంతాల నుంచి రీలర్లు వచ్చి పట్టుగూళ్లను పెద్దఎత్తున కొనుగోలు చేసేవారు. కిలో పట్టుగూడు రూ.450 చొప్పున కొనుగోలు చేసేవారు. దేశంలో కరోనా రెండోదశ విజృంభించడంతో కొన్ని రాష్ట్రాలులాక్డౌన్, కర్ఫ్యూలు విధించారు. మన రాష్ట్రంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు మార్కెట్లలో వ్యాపార కార్యకలాపాలు పరిమితమైన నేపథ్యంలో బెంగళూరు, చెన్నై పాంతాల నుంచి రీలర్లు రాకపోవడంతో స్థానిక వ్యాపారులే దిక్కుగా మారారు.కిలో స్థానిక సిబిఐ రకం రూ.300 ధర పలకాల్సి ఉండగా, రూ.150 పలుకుతోంది. విదేశీ రకపు బైవోల్టెన్ రకం పట్టుగూడు రూ.450 పలకాల్సి ఉండగా రూ.200 తెగనమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా ప్రతి మల్బరీ రైతూ సగానికిపైగా ధరను కోల్పోవాల్సి వస్తోంది. ప్రతిరైతూ సగటున రూ.40 వేల వరకు ఆదాయాన్ని కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది.

# ఇళ్లకే పరిమితం అవుతున్న నేతలు

విజయవాడ, జూన్ 7,(న్యూస్ పల్స్)ప్రతిపక్షం అంటే ఎలా ఉండాలి. అవకాశాలను అంది పుచ్చుకోవాలి. వాటి నుంచే రేపటి గెలుపునకు బాటలు వేసుకోవాలి. ఏపీలో ఏ సర్కార్ అధికారంలోకి వచ్చినా అలాగే చేసింది. నాడు కాంగ్రెస్ వ్యతిరేకతను చంద్రబాబు సొమ్ము చేసుకుంటే బాబు పాలన పట్ల జనాలలో వచ్చిన వ్యతిరేకతను మొత్తం జగన్ లాగేసుకున్నారు. ఇక జగన్ ఏలుబడి మీద జనాలకు ఎటువంటి వ్యతిరేకత లేదు కానీ కరోనా రెండవ దశలో మాత్రం పెద్ద ఎత్తున కేసులు మరణాలు పెరుగుదలతో ఆంధ్రా జనం బాగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంలో పవర్ లో ఉన్న ప్రభుత్వాలనే ఎవరైనా నిందిస్తారు కాబట్టి అంత వరకూ చూస్తే జగన్ కి ఈ పరిణామాలు తలనొప్పిగానే ఉన్నాయి.కరోనా వేళ జనం వణుకుతున్నారు. ఎవరు ఎపుడు పోతారో తెలియక నరకమే చూస్తున్నారు. ఆసుపత్రులలో పడకలు లేకపోవడం, కరోనా మందుల పేరిట కార్పోరేట్ ఆసుపత్రులలో దోపిడి. జగన్ సర్కార్ పై స్థాయిలో తీసుకున్న నిర్ణయాలు దిగువ స్థాయిలో అమలు కాకపోవడం, అధికారుల ఉదాశీనత వంటి వాటి వల్ల జనాలకు ఎక్కడ లేని ఆగ్రహం వస్తోంది. ఈ క్లిష్ట సమయంలో వారికి మేమున్నామని భరోసా ఇచ్చే నాయకులు క్షేత్ర స్థాయిలో ఎవరూ కనిపించడంలేదు. చిత్రమేంటి అంటే జగన్ ఎటూ తాడేపల్లి ఆఫీస్ నుంచి బయటకు కదలడంలేదు. మరి తెలుగుదేశం లాంటి ప్రధాన విపక్షం ఈ టైమ్ లో చేయాల్సింది చాలానే ఉంది కదా.చంద్రబాబు సంగతి సరే. ఆయన వయసు లో పెద్ద వారు కాబట్టి హైదరాబాద్ లో రెస్ట్ తీసుకోవచ్చు. మరి యువ నాయకుడు లోకేష్ కూడా ఎందుకు ప్రవాసంలో ఉంటున్నారు అన్నదే ఇక్కడ ప్రశ్న. లోకేష్ ఎపుడో కరోనా తగ్గిన తరువాత ప్రజలలోకి వస్తాను అంటున్నారు. కానీ అపుడు వస్తే ప్రయోజనం ఏముంటుంది. ఈ ఆపద సమయంలో ఆయన ఏపీలోని పదమూడు జిల్లాలు తిరగాలి. కరోనా వైద్యం ఎలా సాగుతోందో వాకబు చేయాలి. అదే విధంగా అతి పెద్ద టీడీపీ సైన్యం ఉంది. నిన్నటి దాకా అధికారంలో ఉన్న వారు ఉన్నారు. వారంతా కలసి కరోనా రోగులకు ఆర్ధికంగా ఇతరత్రా సాయం చేస్తే టీడీపీ సూపర్ గా ఫోకస్ అవుతుంది. రాజకీయాలు అంటూ నిత్యం జూమ్ యాప్ ద్వారా విమర్శలు చేయడం కాదు, కార్యాచరణతో టీడీపీ క్షేత్ర స్థాయిలోని వెళ్తే ఇపుడు వచ్చే ఆదరణ వేరుగా ఉంటుంది కదా. కానీ కనీసం ఆ దిశగా కూడా టీడీపీ పెద్దలు ఆలోచించకపోవడమే దారుణం అంటున్నారు.ఇక ఏపీలో జనాలు కరోనాతో పోరాడుతూంటే ప్రభుత్వం తాను చేయాల్సింది చేస్తోంది. రేపటి రోజున అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీలు చేష్టలుడిగి కూర్చోవడం కంటే బాధాకరం మరోటి ఉంటుందా అన్నదే జనాల ప్రశ్న. జనసేన పవన్ కళ్యాణ్ అయితే హైదరాబాద్ కే పరిమితం అయ్యారు. ఇక బీజేపీ నేతలు కానీ ఇతర పార్టీల వారు కానీ విమర్శలు చేయడానికే ఉన్నామని చెబుతున్నారు తప్ప జనాల వద్దకు వెళ్ళి తమ వంతు గా సాయం ఎందుకు చేయడం లేదు అన్నదే చర్చగా ఉంది. నిజానికి కరోనా వంటి వాటి నుంచి రాజకీయ లబ్ది పొందకూడదు కానీ మేలు చేసిన వారిని జనాలు ఎప్పటికీ మరచిపోరు కాబట్టి స్వామి కార్యం తో పాటు స్వకార్యం కూడా నెరవేరుతుంది అన్న ధ్యాసరాజకీయ పక్షాలకు లేకపోవడమే చిత్రం. మొత్తానికి వైసీపీని నోటి మాటగా ఎన్ని విమర్శలు చేసినా జనాల్లో రియాక్షన్ ఉండదు, తాము కదలి ఆదుకుంటేనే ఇంపాక్ట్ గట్టిగా ఉంటుందని ప్రతిపక్షాలు గ్రహించాలి. ఒక విధంగా కరోనా కూడా గోల్డెన్ చాన్స్ ఇచ్చేసింది కానీ అందిపుచ్చుకునేవారేరీ..

# పశ్చిమలో కౌలు రైతుల పాట్లు

ఏలూరు, జూన్ 7, (న్యూస్ పల్స్)అన్నదాతను ప్రభుత్వం ముప్పతిప్పలు పెడుతోంది. మొన్నటి వరకూ సంచుల కొరత వంటి అనేక కారణాలతో ధాన్యం కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేసింది. ఇప్పుడు కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తోంది. దీంతో, ఖరీఫ్‌కు పెట్టుబడులు అవసరమైన సమయంలో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. జిల్లాలో గత రబీలో 4.70 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. 340 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 11.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించిన రైతులకు ప్రభుత్వం వారం నుంచి పది రోజులలోగా డబ్బులు చెల్లించాలి. 40 రోజులు అయినా డబ్బులు అందని వారు ఉన్నారు. రైతులకు రూ.1,300 కోట్లకుపైగా ప్రభుత్వం బకాయి పడింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. తొలకరి వర్షాలు కూడా ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులకు వ్యవసాయ పెట్టుబడులు అవసరం. ధాన్యం డబ్బులు అందనందున కోత మిషన్, ధాన్యం తోలు కిరాయిలు, పెట్టుబడులకు తెచ్చిన అప్పులు తీర్చలేని పరిస్థితిలో ఉన్నారు. రైతులపై అప్పుల వాళ్ల ఒత్తిడి పెరిగింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా పెట్టుబడులు అవసరం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ధాన్యం బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. 75 శాతం సాగు వీరే చేస్తున్నారు. వ్యవసాయ పెట్టుబడులు పెట్టాల్సి రావడంతో పాటు, ఎకరా ఒక్కంటికి 15 బస్తాలను కౌలు కింద భూ యాజమానికి ఇవ్వాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వీరిలో రెండు లక్షల మందికి పంట సాగుదారుని హక్కు పత్రాలు (సిసిఆర్‌సి కార్డులు) ఇవ్వలేదు. భూయజమానుల అంగీకారంతో సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని వైసిపి ప్రభుత్వం చట్టంలో మార్పు చేయడంతో కౌలు రైతులు నష్టపోతున్నారు. భూయజమానులు అంగీకారం ఇవ్వకపోవడంతో ఈ కార్డులకు కౌలు రైతులు నోచుకోవడం లేదు. సిసిఆర్‌సి కార్డు లేకుండా కౌలు రైతులకు నేరుగా ధాన్యం డబ్బులు జమ చేయడం కుదరదని అధికారులు చెబుతున్నారు. ధాన్యం డబ్బుల బకాయిలపై పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ డి.రాజును వివరణ కోరగా, వచ్చే వారంలో జమవుతాయని తెలిపారు. సిసిఆర్‌సి కార్డులు లేని కౌలు రైతులు వ్యవసాయాధికారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుని ఇవ్వాలన్నారు.

# టీడీపీలోనేనా...వైసీపీలోకా....

### డీకే ఫ్యామిలీలో..కిం కర్తవ్యం

తిరుపతి, జూన్ 7, (న్యూస్ పల్స్)ఏపీలోని చిత్తూరు జిల్లా రాజకీయాల్లో సంచలనాలకు వేదికగా మారి.. మూడు దశాబ్దాల పాటు రాజకీయంగా చక్రం తిప్పారు.. ఆ కుటుంబ నేతలే డీకే ఆదికేశవుల నాయుడు, సత్యప్రభలు. చిత్తూరు జిల్లా నుంచి ఎంపీగా గెలిచిన ఆదికేశవుల నాయుడుకు రాజకీయంగానే కాక వ్యాపారాల పరంగా కూడా దేశవ్యాప్తంగా మంచి పేరుంది. ప్రస్తుతం వార్తల్లో ఉన్న విజయ్ మాల్యాకు వ్యాపార గురువుగా.. ఆదికేశవుల నాయుడు వ్యవహరించారు. మాల్యా.. వ్యాపారాలు.. వ్యవహారాల్లో ఆదికేశవుల నాయుడు ప్రభావం ఎక్కువగాఉంది. ఈ ఇద్దరూ కలిసి అనేక వ్యాపారాలు కూడా నిర్వహించారుఈ క్రమంలోనే తొలుత కర్ణాటక పాలిటిక్స్‌లో ప్రవేశించిన డీకే ఆదికేశవుల నాయుడు కర్ణాటక మాజీ సీఎం రామకృష్ణ హేగ్డేతో అనేక విషయాల్లో విభేదించి.. రికార్డు సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత.. ఏపీ రాజకీయాలపై దృష్టి పెట్టి.. చంద్రబాబు పిలుపుతో టీడీపీలోకి వచ్చారు. ఈ క్రమంలోనే చిత్తూరు ఎంపీగా 2004లో విజయం దక్కించుకున్నారు. లిక్కర్, విద్య, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సహా అనేక వ్యాపారాల్లో డీకే ఆదికేశవుల నాయుడు పేరు గడించారు. తర్వాత దివంగత మాజీ సీఎం వైఎస్. రాజశేఖర్ రెడ్డి ఒత్తిళ్లతో యూపీఏ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఓటేశారు.అందుకే ఆయనకు టీటీడీ చైర్మన్ పదవి బహుమానంగా వచ్చింది. డీకే ఆదికేశవుల నాయుడు మరణం తర్వాత.. ఆయన సతీమణి.. సత్యప్రభ.. 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున చిత్తూరు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఇక, గత ఎన్నికల్లోనే వీరి వారసుడు డీకే శ్రీనివాస్‌ను రంగంలోకి తీసుకురావాలని ప్రయత్నించినా.. చంద్రబాబు అప్పటి రాజకీయ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వద్దన్నట్టుగా వార్తలు వచ్చాయి. అలాగే సత్యప్రభకు ఇష్టంలేకపోయినా ఆమెను చిత్తూరు అసెంబ్లీ నుంచి కాకుండా రాజంపేట ఎంపీగా పోటీ చేయించగా ఆమె ఓడిపోయారు.ఆ తర్వాత డీకే ఆదికేశవుల నాయుడు ఫ్యామిలీని రాజకీయంగా టార్గెట్ చేశారు. వారు చంద్రబాబు సాయం కోరినా కూడా పట్టించుకోలేదు. అప్పటి నుంచి వారు పార్టీకి దూరంగా ఉంటోన్న టైంలోనే సత్యప్రభ మృతిచెందారు. ఈ క్రమంలోనే టీడీపీ కంటే వైసీపీ బెటర్ అని భావించిన ఆమె కుమారుడు.. శ్రీనివాస్.. సీఎం జగన్ ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే.. శ్రీనివాస్.. విషయంలో వైసీపీ అధినేత జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. శ్రీనివాస్ కూడా ఎలాంటి ప్రయత్నాలు తర్వాత చేయలేదు. ఇప్పుడు శ్రీనివాస్ కూడా మౌనంగా ఉన్నారు. వైసీపీ నుంచి కూడా ఎలాంటి ప్రయత్నాలు సాగడం లేదు. అయితే డీకే ఆదికేశవుల నాయుడు ఫ్యామిలీ వ్యాపారాలకు అయితే ఎలాంటి ఇబ్బంది లేదని తెలుస్తోంది. టీడీపీ కూడా ఈ కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో డీకే కుటుంబ రాజకీయాలు ముగిసినట్టేనా? అనే చర్చ సాగుతుండడం గమనార్హం.

# పేరు కోసం ప్రతిష్ట కోసం ఏ రోజు పాకులాడలేదు...

### సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్ రెడ్డి

నెల్లూరు సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి ఆనందయ్య ఆయుర్వేద మందును పంపిణీ చేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గోలగమూడి శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమం వద్ద లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ ఆయుర్వేద మందును అందజేసిన తర్వాతనే ఇతరులకు పంపుతామన్నారు.

ప్రజలందరికీ ఆరోగ్యం దక్కాలన్న లక్ష్యంతోనే శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమం లో ఈ మహత్తర పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఆనందయ్య ఆయుర్వేద మందు కు సంబంధించి పేరు కోసం ప్రతిష్ట కోసం ఏ రోజు తాను పాకులాడలేదని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా ఆనందయ్య ఆయుర్వేద మందును అందించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఆనందయ్య ఆయుర్వేద మందు కు సంబంధించి అన్ని అనుమతులు వచ్చేలా కృషి చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి తన కృతజ్ఞతలు తెలియజేశారు

# ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి

### ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ టి స్వాతి

పత్తికొండ ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పత్తికొండ ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ స్వాతి చెప్పారు. సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ పత్తికొండ పట్టణంలో ని ఏపీఆర్ఎస్ బాలుర పాఠశాలలో 80 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోపు పూర్తి వివరాలతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. జూలై 14వ తేదీన కర్నూలు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు వివరాలు సక్రమంగా లేకపోతే అర్హులు కారన్నారు. ఆన్లైన్లో దరఖాస్తు పంపిన తరువాత ఒక రెఫరెన్స్ నెంబరు ఇవ్వబడుతుందని తెలియజేశారు. నింపిన దరఖాస్తు నమూనా కాపీని ప్రింట్ తీసుకొని దగ్గర ఉంచుకోవాలని చెప్పారు. దీనితో పాటు ఒక పాస్ ఫోటో సైజు ఫోటోను సిద్ధంగా ఉంచుకోవాలని తెలియజేశారు.

## జీజీహెచ్లో 24వ రోజు జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

నెల్లూరు . నెల్లూరు నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి లో గత 24 రోజులుగా జనసేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు9500+పేదలకు ఆహారం అందజేసినట్లు జిల్లా జనసేన నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూపవన్ కళ్యాణ్ ,మనుక్రాంత్ స్ఫూర్తి తో జనసేన నాయకులు గునుకుల కిషోర్ క్షేత్ర స్థాయిలో గత 3 వారాలుగా, హోమ్ ఐసోలేషన్ లో పేదలకు ,లాక్డౌన్ తీసి వేసే వరకూ గత ఆహారం అందిస్తూ, మంచి నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న పేషెంట్ల ,వెయిటర్లు కొరకు మంచి నీటి క్యాన్ లు పెట్టి 3పూటల మంచినీరు నింపే ఏర్పాటు లాక్డౌన్ తీసి వేసే వరకూ జరుగుతున్న కార్యక్రమంలోఈ కార్యక్రమం లో గునుకుల కిషోర్ తో పాటు ప్రశాంత్ గౌడ్,సుధీర్,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# రఘురామ టార్గెట్ ఏంటీ..పరువు బజారు కీడుస్తున్నారా



ఏలూరు, జూన్ 7, (న్యూస్ పల్స్)నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజుకు జగన్ కి మధ్య ఆజన్మ వైరం ఏదో ఉన్నట్లుంది. లేకపోతే రెండేళ్ళుగా జగన్ ని ఊపిరి తీసుకోకుండా ఇబ్బందుల పాలు చేస్తూనే ఉన్నారు. ఆయన్ని ఏదో రకంగా దారికి తేవాలనుకున్న జగన్ ప్రయత్నాలు అన్నీ కూడా బెడిసికొడుతున్నాయి.దేశంలో ఎంత మంది ఎంపీలు ఉన్నారో అంతమందికీ రఘురామ కృష్ణంరాజు తన జైలు కథను అరెస్ట్ బాధను ని హరికథ మాదిరిగా వివరిస్తూ లేఖలు రాశారు. ఎపుడు పార్లమెంట్ సమావేశాలు జరిగినా మీ అందరి మద్దతు పార్టీలకు అతీతంగా నాకు ఇవ్వాలని అభ్యర్ధించారు. తన మీద థర్డ్ డిగ్రీని ఏపీ సీఐడీ అధికారులు ప్రయోగించారు అంటూ ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఒక ఎంపీ హక్కులు ఏపీ సర్కార్ పూర్తిగా కాలరాసిందని కూడా ఆయన వాపోయారు. తన మీద రాజద్రోహం కేసు కూడా పెట్టారని రఘురామ కృష్ణంరాజు చెప్పడంతో ఇపుడు పార్టీలకు అతీతంగా ఎంపీల మద్దతు రాజుకు దక్కుతోందిట. పైగా తోక తొక్కిన పాముల రఘురామ కృష్ణంరాజు రెచ్చిపోతున్నారు. ఆయన్ని సీఐడి అధికారులు కేసులు పెట్టి అరెస్ట్ చేశారు అన్నది ఏ కాస్తా కూడా వైసీపీ పెద్దలకు రిలీఫ్ ఇవ్వకపోగా రఘురామ కృష్ణంరాజు మరింత దూకుడు పెంచేశారు. ఆయన బెయిల్ మీద ఉంటూనే ఢిల్లీలో చేయాల్సినవన్నీ చేస్తున్నారు. తాజాగా ఆయన వేసిన మాస్టర్ ప్లాన్ తో జగన్ సర్కార్ పరువు ఢిల్లీలో పూర్తిగా పోయే సీన్ కనిపిస్తోంది. తన మీద దాడి చేసిన వారి మీద సభా హక్కుల ఉల్లంఘణ నిబంధన మేరకు చర్యలు తీసుకోవాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కోరిన రఘురామ కృష్ణంరాజు పనిలో పనిగా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని అభ్యర్ధించి ఆయన నుంచి గట్టి హామీ తీసుకున్నారుట. అంటే రేపటి రోజున కరోనా తగ్గి పార్లమెంట్ కనుక సమావేశం జరిపితే రఘురామ కృష్ణంరాజు ఏకంగా నిండు సభలో ఏపీ సర్కార్ పరువు తీయడానికి అంతా రెడీ చేసుకున్నట్లుగా అర్ధమవుతోంది. మరి రాజు తన గోడుని అక్కడ వెళ్లబోసుకుంటే మిగిలిన ఎంపీలు మద్దతు ఇస్తే జాతీయ స్థాయిలో ఏపీ సర్కార్ పరువు పూర్తిగా పోవడం ఖాయమనే కలవరం అయితే వైసీపీలో కనిపిస్తోంది.రఘురామ కృష్ణంరాజు తనకు ఆరోగ్యం బాలేదని ఎయిమ్స్ ఆసుపత్రి నుంచి ట్రీట్ మెంట్ తీసుకుంటున్నారు. ఆయన మీద విచారణకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చినా ఆయనను మళ్ళీ పిలిచే పరిస్థితి ఉంటుందా. ఒక వేళ ఉన్నా ఆయన వస్తారా అన్నది చర్చ. ఆయన తన అనారోగ్యాన్ని అడ్డం పెట్టుకునే ఢిల్లీ వీధుల్లో తిరిగి చేయాల్సిన యాగీ అంతా చేస్తున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నోరు విప్పడంలేదు కానీ తన చర్యలు అన్నీ మీడియాకు చక్కగా తెలియచేస్తున్నారు. ఆయన విషయంలో మరో మారు రాంగ్ స్టెప్ వేసిన పాపానికి వైసీపీ మౌన ప్రేక్షకురాలిగా ఇదంతా చూడాల్సి వస్తోంది. మరో వైపు రఘురామ కృష్ణంరాజు మీద పెట్టిన రాజద్రోహం సెక్షన్ మీద పునర్ నిర్వచించాల్సి ఉందని న్యాయ నిపుణులు అంటున్నారు. ఇలా సీఐడీ పెట్టిన అన్ని సెక్షన్లూ వీగిపోతూండగానే రఘురామ కృష్ణంరాజు మాత్రం ఏకంగా ఏపీ సర్కార్ కే ఇపుడు రెబెల్ అయిపోయారు అంటున్నారు. ఏడేళ్ల క్రితం ఎంపీగా చేసిన జగన్ రేపటి పార్లెమెంట్ సమావేశాల్లో మరోమారు మారుమోగనున్నారా.. చూడాల్సిందే.

# రూ. 40.95 లక్షల విలువ గల 35 ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ వితరణ

## జువారి సిమెంట్స్ దాతృత్వం అభినందనీయం, జిల్లా తరపున ధన్యవాదాలు తెలిపిన కలెక్టర్ సి. హరికిరణ్

కడప, జూన్ 7 రూ. 40.95 లక్షల విలువ గల 35 ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ ను వితరణ చేసిన.. జువారి సిమెంట్స్ వారి దాతృత్వం అభినందనీయం అని.. జిల్లా కలెక్టర్ సి హరికిరణ్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్లో కడప జువారీ సిమెంట్స్ వారు రూ. 40.95 లక్షల విలువ గల 35 ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ తో పాటు 200 ఆక్సిజన్ ఫ్లో మీటర్స్, 30 ఆక్సిజన్ సిలెండర్స్ ట్రోలిలు, 200 ఆక్సిజన్ నాజల్ పైప్స్ ను జిల్లా కలెక్టర్ సి. హరికిరణ్ కు అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. హరికిరణ్ మాట్లాడుతూ... జిల్లాలో కొవిడ్ రెండో దశను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ... జిల్లా ప్రజలకు ప్రాణవాయువును అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ. 40.95 లక్షల విలువ గల 35 ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్, 200 ఆక్సిజన్ ఫ్లో మీటర్స్, 30 ఆక్సిజన్ సిలెండర్స్ ట్రోలిలు, 200 ఆక్సిజన్ నాజల్ పైప్స్ ను అందించిన జువారీ సిమెంట్స్ వారికి జిల్లా ప్రజల తరుపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. వీటిని జిల్లాలో అవసరమైన ఆసుపత్రులకు పంపిణీ చేస్తామన్నారు. కోవిద్ వ్యాప్తిని అరికట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం.. పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ఈ విషయంలో ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ప్రభుత్వ నియమ నిబంధనలను తూచా తప్పక పాటించాలని అన్నారు. అత్యవసరమైతేనే ఇంటి నుండి బయటకు వెళ్లాలని, ఖచ్చితంగా మాస్కు ధరించి .. సామాజిక దూరం పాటించి.. జిల్లాను కోవిడ్ రహిత జిల్లాగా తీర్చి దిద్దెందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జువారీ సిమెంట్స్ ప్లాంట్ హెడ్ జి.ఎన్. బి. రావు, హెచ్.ఆర్. హెడ్ అశిష్ రెడ్డి, మైన్స్ హెడ్ కె.వి.ఎస్. శర్మ, మైయింటెనెన్సు హెడ్ ఎం. కె. జైన్, ప్రోక్యూర్మెంట్ హెడ్ కె.వి.ఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల తీరు గర్హనీయం

విశాఖపట్నం విశాఖలో కోవిడ్ వారియర్ పై పోలీసులు వ్యవరించిన తీరు అమానుషమని రాష్ట్ర తెలుగు మహిళ అధ్యక్షురాలు అనిత అన్నారు.ఉపాది కోసం విశాఖకు వచ్చిన వారిపై పోలీసులు ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఆక్షేపించారు.అపర్ణ అనే యువతి పట్ల కర్కశంగా ప్రవర్తించి మానసికంగా ఆవేదనకు గురిచేశారని,కోవిడ్ వారియర్స్ కు ఒకవైపు సన్మానాలు చేస్తున్న తరుణంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ ప్రకటనలు చేస్తున్న పోలీసు అధికారులు ఇలాంటి ఘటనలు జరుగుతుంటే ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.యువతి పట్ల అమానుషంగా ప్రవర్తించడమే కాకుండా ఆమె పై కేసులు కూడా పెట్టారని,ఈ విషయం పై హోమ్ మంత్రి ,మహిళ కమిషన్ ఎందుకు స్పందించలేదని నిలదీశారు.ఈ విషయం పై నగర కమిషనర్ స్పందించాలని,ఆమె పై పెట్టిన కేసులు ఎత్తువేసి పోలీసులు పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దొంగల హల్ చల్

విశాఖపట్నం విశాఖపట్నం కంచరపాలెం 55వ వార్డు ధర్మానగర్ లో శ్రీలాల్ బహుదుర్ శాస్త్రిజీ గ్రంథాలయం వీధిలో మూడు ఇళ్ల లో దొంగలు పడ్డారు. డబ్బు బంగారం విలువైన వస్తువులు దోచుకొని పోవడం పోయారు. ఈ ఘటనలో అక్కడ నివసిస్తున్న స్థానికలు ఒక్కసారిగా భయంతో ఉలిక్కి పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం గత కొన్ని రోజులు గా వీధిలో ద్విచక్రవాహనాలు పోవడం, . అలాగే కారులు. ఆటోలో టేప్ రికార్డు. టైర్లు. దొంగతనం జరుగుతున్నాయి. ఇప్పుడు ఏకంగా దొంగలు ఇంటిలోకి దూరి ఒక్క ఇంటిలో రూ 25000/-. ఇంకో ఇంటిలో రై 15000 -. అలాగే మూడు సెల్ ఫోన్.అలాగే బంగారు ఆభరణాలు.దొంగలు దోచుకొని పోవడం తో బాధితులు కంచరపాలెం పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసారు. పోలీసులు సంఘటన స్థలంకు రావడం జరిగింది. సంఘటనాస్థలం పరిశీలించి. క్లూ టీమ్ రప్పించి వివరాలు సేకరించారు.

# ఉద్యోగ నియామకాల క్యాలెండర్ను విడుదల చేయాలి - డివైఎఫ్ఐ

కడప జూన్ 7 కడప నగరంలోని డివైఎఫ్ఐ ఆఫీసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామక క్యాలెండర్ ను విడుదల చేయాలని ×ఆజఈఎ జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ తెలిపారు.స్థానిక జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు ప్రతిరోజు ఎక్కడికి వెళ్ళినా చెప్పినవే కాదు చెప్పనివి కూడా చేస్తున్నాం అని గొప్పలు చెప్పుకుంటారు. పేపర్లో ప్రకటనలు యాడ్స్ పెద్ద పెద్ద అక్షరాల్లో ఇస్తారు కానీ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు ఏపీపీఎస్సీ క్యాలెండర్ 2 సంవత్సరాలు అయినా విడుదల చేయలేదు అన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన ఒక్క డీఎస్సీ కానీ గ్రూప్స్ కానీ నోటిఫికేషన్ రాలేదని అలాగే ప్రతి సంవత్సరం ఖాళీ అయిన పోస్టుల వివరాలను మరియు రాష్ట్రంలో సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉన్న ఉద్యోగాల భర్తీకి ఎలాంటి చొరవ చేయలేదని అలాంటప్పుడు పేపర్లలో చెప్పినవే కాదు చెప్పనివి కూడా చేశామని గొప్పలు ఎందుకు చెప్పుకోవాలని వాటి ప్రచారానికి ఖర్చు పెట్టే బదులు నిరుద్యోగులకు భృతి ఇవ్వడం మంచిది అని తెలియజేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోలీసు ఎస్ఐ డీఎస్సీ గ్రూప్స్ అలాగే బ్యాక్ లాక్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నాడు నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలు మార్చామని చెప్పుకునే ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా8 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. గోడలకు పెయింట్ వేసినంత మాత్రాన విద్యార్థులకు చదువు సక్రమంగా అందదని వారికి చదువు చెప్పే ఉపాధ్యాయుల పెరిగినప్పుడు అది సాధ్యమవుతుందని తెలియజేశారు.ఇప్పటికే అనేకమార్లు జాబ్ క్యాలెండర్ విడుదల తేదీలను చెప్పి వాయిదాలు వేశారు అన్నారు.ఉగాదికి ఖచ్చితంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్నాం అని చెప్పి ఇప్పటికి ప్రభుత్వం నుండి ప్రకటననే విడుదల కాలేదు అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిరుద్యోగుల సమస్యలను తీర్చాలని కోరారు.సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముడియం.చిన్ని పాల్గొన్నారు.

# వృద్ధురాలి దారుణహత్య

చిత్తూరు చిత్తూరు జిల్లా వికోట మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. పట్టణంలోని మసీదు వీధిలో నివాసముంటున్న అబ్బాస్ భార్య అలీమా (80)ను ఎవరో గుర్తు తెలియని దుండగులు హతమార్చారు. ఈరోజు ఉదయం పాలవాడు వచ్చి తలుపు తట్టినా తీయక పోవడంతో ఎదురింటివారు ఇంట్లో గమనించగా ఆమె అచేతనంగా పడి ఉంది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంట్లో ఆమెను ఎవరో హతమార్చి ఇంటి డాక్యుమెంట్లను పూర్తిగా తగులబెట్టిన ఆనవాళ్లు పోలీసులు గుర్తించారు. ఆమెకు సంబంధించిన బంగారు ఆభరణాలు లేకపోవడంతో ఎవరో దొంగలు కావాలనే ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పలమనేరు డీఎస్పీ గంగయ్య సీఐ ప్రసాద్ బాబులు ఘటనా స్థలాన్ని సందర్శించి హత్య జరిగిన వైనం పై ఆరా తీశారు. చిత్తూరు నుంచి డాగ్ స్క్వాడ్ క్లూస్ టీమ్ సైతం రంగంలోకి దిగాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కాంగ్రెస్ దీక్ష

మంచిర్యాల రాష్ట్రంలో పేదలకు కరోనా, బ్లాక్ ఫంగస్ వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ ఒక రోజు దీక్షలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావుతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతో దేశంలో అనేక మంది కరోనా, బ్లాక్ ఫంగస్ వ్యాధుల బారిన పడి చనిపోతున్నారని ఆరోపించారు. ఒకవైపు ఎన్నికలు, కుంభమేళా నిర్వహించడం వల్ల దేశవ్యాప్తంగా కరోనా ఉధృతి పెరిగిందని ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్, బ్లాక్ ఫంగస్ కు సరైన వైద్యం అందుబాటులో లేక ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే బాధితులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఆసుపత్రికి వెళితే ఆస్తులు అమ్ముకోవాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి అనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నా అరికట్టడంలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమె పేర్కొన్నారు. వెంటనే రాష్ట్రంలో పేద ప్రజలకు కరోనా, బ్లాక్ ఫంగస్ కు ఉచితంగా వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు రాజేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షులు అంకం నరేష్ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి అర్కల హేమలత, మహిళ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అద్యక్షులు, కౌన్సిలర్ సల్ల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

# భూత వైద్యానికి యువకుడు బలి

కర్నూలు భూత వైద్యానికి యువకుడు బలి అయిన ఘటన ఇది. మద్దికెర మండలం పెరవలి గ్రామానికి చెందిన నరేష్(24)కు మూర్ఛ వ్యాధి రావడంతో మూఢ నమ్మకాలతో భూత వైద్యున్ని కుటుంబసభ్యులు ఆశ్రయించారు. దెయ్యం పట్టిందంటూ ఇంట్లో బంధించి ఈత కట్టెలతో కొట్టడంతో నరేష్ ఆరోగ్యం మరింత క్షీణించింది. దాంతో గ్రామస్థులు అంతా చందాలు వేసుకొని హాస్పిటల్ కి తీసుకెళ్లి ట్రీట్మెంట్ ఇప్పించారు. అయినా నరేష్ కోలుకోలేదు. తరువాత మృతి చెందాడు. యువకుడు కర్నూలు లోని హాస్పిటల్ లో మృతి చెందగా గ్రామంలో ఇలాంటి ఘటన జరగడం ఒక్కసారిగా గ్రామస్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భూతవైద్యుడి తతంగంపై, యువకుడి మృతి ఘటనపై పోలయిూసులు గ్రామానికి వెళ్లి మృతుడి బంధువులు, స్నేహితులతో విచారణ చేపట్టారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం

## డివిజన్ ఇంచార్జి రామ్మోహన్

నెల్లూరు నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిలోని 2వ డివిజన్ గుడిపల్లిపాడు గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని స్థానిక డివిజన్ ఇంచార్జి, వైకాపా నాయకులు పగిడినేటి రామ్మోహన్ పేర్కొన్నారు. గుడిపల్లి పాడు గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ కాలిపోయి , నీళ్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ,నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని వివిధ సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యంగా తన వంతు బాధ్యతాయుత విధుల్లో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది అన్నారు. ఈ క్రమంలో మీరు లేక క పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న డివిజన్ ప్రజలకు తన వంతు సహకారం అందించాలని అదే తన ఆశయం అన్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం కారణంగా నీళ్లు రాకపోవడంతో ట్యాంకర్స్ నీళ్లు తెప్పించి ,ప్రతి కాలనీ కి పంపించి, నీటి కొరత తీర్చేందుకు తన వంతు కృషి చేయడం జరిగినది అని తెలిపారు. సంబంధిత విద్యుత్ ఏ. ఈ తో మాట్లాడి, వెంటనే ట్రాన్స్ఫార్మర్ పునరుద్దరించి ,ప్రజల సమస్యను పరిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. విషయమై 2వ డివిజన్ స్థానిక ప్రజలు, డివిజన్ ఇంచార్జి రామ్మోహన్ సేవలు అభినందనీయమని ఆయన సేవలను కొనియాడారు.


# టీడీపీ నిరసన

తిరుపతిపదో పరీక్షలు రద్దుపై తిరుపతిలో టిడిపి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేసింది.కరోనా విపత్కాలంలో ... పదో తరగతి పరీక్షలపై నిర్వహణపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తిరుపతిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహప్రసాద్ స్కూల్ యూనిఫామ్ ధరించి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేకూ పదో తరగతి పరీక్షలు రద్దు చేయాలంటూ ... తిరుపతి కపిలతీర్థంలో... విన్నూత్న రీతిలో నిరసన తెలిపారు.విద్యార్థి వేషంలో నరసింహప్రసాద్ .. పిల్లల మనోభావాలను తెలియచేసేలా వారి సమస్యలను ఎకరవు పెట్టారు.ప్రభుత్వం తక్షణమే పరీక్షలను రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వం విఫలమయింది

ఒంగోలుకరోనా ను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎమ్ రాష్ట్ర కార్యదర్శి మధు విమర్శించారు.. కరోనా నియంత్రణలో కేరళ ప్రభుత్వం తీసుకున్న ముందుస్తు జాగ్రత్తలు మంచి ఫలితాలు ఇచ్చాయని తెలిపారు..కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కరోనా సెకండ్ వేవ్ తీవ్ర ప్రభావాన్ని చూపిందని విమర్శించారు..పక్కనున్న రాష్ట్రాల్లో ముందస్తు జాగ్రత్తలతో ఎక్కడికక్కడ ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తే..మన రాష్ట్రంలో మాత్రం ఒక్క ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం సిగ్గుచేటని మధు అన్నారు..కరోనా సమయంలో డాక్టర్లు చేస్తున్న సేవలఉ మరువలేనివని తెలిపారు..

# గ్రామాలకు చేరుకుంటున్న కరోనా



హైదరాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్) గాలి పచ్చని చెట్లతో మనసుకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయి పల్లెలు. చుట్టూ పొలాలు వాటిని సాగుచేసుకునే రైతన్నల కుటుంబాలతో కళకళలాడుతుంటాయి. పొరుగు వారిని మామ అత్త బాబాయ్ పిన్ని ఇలా ఆప్యాయంగా పలిచే పిలుపులకు వేదిక. కరోనా దేశవ్యాప్తంగా విజృంభిస్తున్న నేపథ్యంలో అన్ని మహానగరాల నుంచి చిన్న చిన్న నగరాల వరకు పెద్ద పంచాయితీల నుంచి చిన్న వరకు ఎక్కడ చుసిన మహమ్మారి ప్రజలను పీడించడం మాత్రం సెకండ్ వేవ్ లో సర్వ సాధారణం అయిపోయింది. కరోనా వైరస్ రాకుండా కొన్ని గ్రామాలూ రోడ్డుని త్రవేసిన మూళ్ళ కంపలు వేసిన కరోనా ఎంట్రీ మాత్రం ఆగలేదు.అయితే కరోనా మహమ్మారి దేశాన్ని కుదిపేస్తున్నది. మొదటి వేవ్ ప్రభావం నగరాలు పట్టణాలై అధికంగా ఉండగా సెకండ్ వేవ్ ప్రభావం గ్రామాలు పల్లేలపై ఉన్నది. దీంతో గ్రామాల్లోని ప్రజలు ఆంధోళన చెందుతున్నారు. బయటకు రావాలంటే ఆలోచిస్తున్నారు. మొదటి వేవ్ సమయంలో నగరాలకు వలస వెళ్లిన కూలీలు కరోనా కారణంగా తిరిగి పల్లేబాట పట్టారు. నగరాల నుంచి పల్లెలకు చేరుకోవడంతో మెల్లిగా గ్రామాల్లో కరోనా విస్తరించడం మొదలైంది. గ్రామాల్లో వైద్యసేవలు ఎంతవరకు అందుబాటులో ఉంటాయో అందరికి తెలిసిందే. ఒకసారి కరోనా గ్రామంలో వ్యాపించడం మొదలుపెడితే దానిని అడ్డుకోవడం కష్టం అవుతుందని వైద్యనిపుణులు గతంలో పలుమార్లు తెలియజేశారు. సెకండ్ వేవ్ ఎఫెక్ట్ గ్రామాలపైనే అధికంగా ఉండటంతో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని ప్రజలు కూడా అప్రమత్తం కావడంతో కరోనాను కొంతమేర అడ్డుకున్నారని చెప్పొచ్చు. ఆ పల్లెలోని కట్టుబాట్లే పల్లె వాసులకు శ్రీరామా రక్షగా మారింది. పెద్దలు చెప్పిన మాటను జవదాటని ఆ పల్లె వాసులు కరోనా రహిత గ్రామంగా తీర్చి దిద్దుకొని కొన్ని జిల్లాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లో కరోనా కట్టడికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోటోకాల్ను కేంద్రప్రభుత్వం రిలీజ్ చేసింది. విలేజ్ లెవెల్లో నిఘా పెట్టాలని సూచించింది. టెస్టులు చేసి పాజిటివ్ వచ్చినవారిని ఐసోలేట్ చేయాలని తెలిపింది. వారికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లతో టెలీ కన్సల్టేషన్ నిర్వహించాలని సూచించింది. శాచురేషన్ తక్కువగా ఉన్నవారిని, కోమోర్బిడిటీస్ ఉన్నవారిని పెద్ద హాస్పిటల్స్కు తరలించాలని తెలిపింది. లక్షణాలున్నవారికి వెంటనే ర్యాపిడ్ యాంటీజెన్ టెస్టులు చేయాలని కేంద్రం తెలిపింది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఒఔఓలకు ర్యాపిడ్ యాంటీజెన్ టెస్టులు చేయడంలో ట్రెయినింగ్ ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు, ఖఊఅలలో యాంటీజెన్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉంచాలని కేంద్రం ఆర్డర్స్ జారీ చేసింది. పాజిటివ్ వచ్చిన వారికి హోం ఐసోలేషన్ కిట్ అందచేయాలని సూచించింది. ఆ కిట్లో పారాసిటమాల్, ఐవర్మెక్టిన్, కఫ్ సిరప్, మల్టీవిటమిన్ ట్యాబ్లెట్లు ఉండాలి

# వివేకానందరెడ్డి హత్య కేసు విచారణ తిరిగి ప్రారంభం

కడప జూన్ 7 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు సుమారు ఏడు నెలల తర్వాత విచారణ తిరిగి ప్రారంభమయ్యింది. కేసు విచారణ నిమిత్తం ఆరుగురితో కూడిన సీబీఐ అధికారుల బృంధం ఇప్పటికే కడప కేంద్ర కారాగారం అతిథిగృహానికి చేరుకున్నది. రెండేళ్ల క్రితం జరిగిన వివేకానందరెడ్డి హత్య కేసులో పలువురిని విచారించిన సీబీఐ.. గతేడాది కొందరిని విచారించింది. అయితే విచారణకు వచ్చిన అధికారుల్లో కొందరు కరోనా బారినపడ్డారు. దీంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఏడు నెలల తరువాత మళ్లీ విచారణ జరిపేందుకు అధికారులు వచ్చారు.

# ప్రజల ప్రాణాలను కాపాడే మందులో వైసీపీ నేతల అవినీతి...

## అక్రమాలను ప్రశ్నిస్తే కేసులా...?

కడప జూన్ 7 కడప శివారులోని రిమ్స్ వద్ద 19వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కడప అసెంబ్లీ టీడీపీ ఇంచార్జి, వి.ఎస్.అమీర్ బాబు.ఈ సందర్భంగా వి.ఎస్.అమీర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.....స్థానిక సంస్థలలో 34% రిజర్వేషన్ ఉంటే దానిని 24% చెశావు ఇదేనా నీకు బి,సి ల మీద ప్రేమ...! అని వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు నవరత్నాలను ఇస్తూ అన్నీ ఇచ్చేశామంటూ ఎస్సీలను, బిసిలను మోసం చేశారని మండిపడ్డారు ఒక్క చాన్స్ అని చెప్పి మోసపూరిత మాటలు చెప్పి వారి ఓట్లు వెయించుకుని వారిని పూర్తిగా విస్మరిస్తున్నారాని దుయ్యబట్టారునవరత్నాలలో ఇచ్చినవి కలుపుకుని ఎస్సీ లకు, బి,సి లకు న్యాయం చేశామని చెప్పుకోవడం నీకే చెల్లింది అని ధ్వజమెత్తారుమాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారుప్రజల ప్రాణాలు కాపాడే మందులో వైసీపీ నేతల అవినీతి అక్రమాలను, ప్రశ్నిస్తే కేసులా...? అని ప్రశ్నించారు ఆనందయ్య మందుని ఆన్లైన్లో విక్రయించడానికి ప్రయత్నించిన నర్మద్రెడ్డి... వైసీపీ ఎమ్మెల్యే కాకాణికి సన్నిహితులుకారా? అని ప్రశ్నించారుకాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రమేయం లేకుండానే నర్మద్రెడ్డి వెబ్సైట్ ప్రారంభించారా? అని నిలదీశారుప్రభుత్వానికి, శ్రేశిత టెక్నాలజీస్ వెబ్సైట్కి సంబంధం లేకపోతే.. వెంటనే కాకాణిపై చర్యలు తీసుకోవాలిప్రభుత్వం తక్షణమే సోమిరెడ్డిపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కొవిడ్ నిబంధనల పేరుతో ధూళిపాళ్ల నరేంద్రపై పెట్టిన కేసును కూడా తీసేయాలని వి.ఎస్.అమీర్ బాబు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శివకొండా రెడ్డి, జలతోటి జయకుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, ఖాన్ బాష, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి

## - ఎం జి పెట్రోల్ బంకు వద్ద నిరసన

ఎమ్మిగనూరు( విభారె) పట్టణంలో కేంద్ర ప్రభుత్వం గత కొన్ని రోజులుగా పెంచుతూ పోతున్న పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఎం డివిజన్ నాయకులు హనుమంతు బి రాముడు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎంజి పెట్రోల్ బంక్ వద్ద ఆందోళన చేపట్టారు ఈ ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ గత నెల రోజుల్లో ప్రభుత్వం 18 సార్లు పెట్రోలు, డీజిల్, ధరలు పెంచడం అమానుషమన్నారు. పెంచిన ధరల ప్రభావం నిత్యావసర సరుకులపై పడిందన్నారు. రాష్ట్రంలో లీటర్ పెట్రోలు ధర రూ.100 దాటిందన్నారు. కరోనాతో ప్రజలు ఓ వైపు అల్లాడుతుంటే మరోవైపు ధరల పెరుగుదలతో ప్రజలు ఏమి కొనలేని తినలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెంచిన పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదలపై కక్షతో భారాలు మోపుతోందని ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు, కరోనా కష్టకాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలను కాపాడాల్సింది పోయి వారిపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు వరాలు కురిపించేందుకు ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు, మోడీ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు, పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు వసంత రాజు, కాలప్ప , రవి , శేషప్ప, వీరేంద్ర , వీర కృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

# సూగూరు గ్రామంలో నీటి కొరత. పట్టించుకోని అధికారులు

మంత్రాలయం ( విభారె) మండల పరిదిలోని సూగూరు గ్రామంలో గత నాలుగు రోజులుగా నీరు రావడం లేదు అని గ్రామస్థులు తెలియజేశారు. ఈ సందర్భంగా నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ మంత్రాలయం నియెజకవర్గ అధ్యక్షులు హనుమన్న మాట్లాడుతూ సూగూరు గ్రామంలో గత నాలుగు రోజులుగా తాగడానికి నీళ్లు లేకపోవడం సిగ్గు చేటు అని అన్నారు. ఎందుకంటే సూగూరు లో ఇంత పెద్ద చెరువు పెట్టుకోని వారంలో రెండు,మూడు రోజులు నీళ్ళు కొరత రావడం ఎంటి అని అడిగితే కరెంటు లేదు,ప్రతి రోజు రాత్రి ట్యాంకు ఫుల్ చేస్తున్నాము కాని ఎక్కడ పోతాయో ఏమో అనేది అర్థం కావడం లేదు అని అర్థం లేని సమాధానాలు చెప్పడం అక్కడున్న ఆప్రెటర్స్ చెపుతున్న మాట అన్న నీళ్ళు రావడం లేదు ఎంటి సమస్య అని అడిగినా ప్రతి ఒక్కరినీ నోరు మూపించడం తప్ప పని చేయడం లేదు ఎంత మందికి మొర పెట్టుకున్నా ప్రయోజనం లేదని వాపోయారు.ఎవరు పట్టించుకుంటారో తెలియదు అక్కడున్న ఆప్రెటర్స్,పట్టించుకోవడం లేదు సూపర్వేజర్, నారాయణ,పట్టించుకోవడం లేదు అధికారులకు ఎవరికి చెప్పిన ప్రయొజనం లేకపోయింది ఈ విషయాన్నీ కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్థులు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో హనుమంతప్ప,రాజేష్, గాబ్రేల్, వీరేశ్, హేజ్కెల్,నాగరాజు,రాజు,ప్రభాకర్, అంజినప్ప, ప్రేమరాజు,తదితరులు పాల్గొన్నారు

# నిషేధిత గుట్కా ప్యాకేట్లు స్వాధీనం

## 8 మందిపై కేసు నమోదు

మంత్రాలయం మండల కేంద్రంలో అక్రమ నిషేధిత గుట్కా ప్యాకేట్లు స్వాధీనం చేసుకుని ,8 మంది పై కేసు నమోదు చేసిన సంఘటన గత ( ఆదివారం) రాత్రి చోటుచేసుకుంది. సిఐ కృష్ణయ్య తెలిపిన వివరాలు మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు మంత్రాలయంలోని దుకాణాలుపై దాడులు చేశామని ఈ దాడులులో సుమారు రూ . 45000 వేలు విలువ చేసే అక్రమ నిషేధిత గుట్క ప్యాకేట్లు దొరికాయని వాటిని స్వాధీనంచేసుకొని లక్ష్మీనారాయణ శెట్టి, హరి శెట్టి , రాఘవేంద్ర శెట్టి , బసిరెడ్డి, విశ్వనాథ్ శెట్టి, కుమార్ ,నారాయణ శెట్టి సూర్యనారాయణ శెట్టి అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు .ఈ దాడుల్లో ఎస్సై ఎర్రన్న ,హెడ్ కానిస్టేబుల్ జయన్న, కృష్ణయ్య, కానిస్టేబుల్ పరమేష్, క చిన్న బసప్ప, తదితరులు ఉన్నారు .

### గూడూరు పాత బస్టాండ్ సమీపంలోని అంగళ్లలో ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు నెల్లూరు జిల్లా, గూడూరు కేంద్రంలోని, గూడూరు పాత బస్టాండ్ లో సబ్ ఇనస్పెక్టర్ బ్రహ్మ నాయుడు ఆధ్వర్యంలో అంగళ్ళ లో ఆకస్మిక తనిఖీలు సోమవారం జరిగాయి.గూడూరు పాత బస్టాండ్, లోని దుకాణాలలో నిషేధిత గుట్కా, హన్స్ పాకెట్స్ అక్రమంగా అమ్ముతున్నారని సమాచారం రావడం తో, గూడూరు 1 టౌన్ ఎస్సై బ్రహ్మ నాయుడు, దుకాణ ములలో, పరిశీలించి, అక్కడ నిషేధిత పాకెట్స్ లేకపోవడం తో, దుకాణయజమాను లకు, నిషేధిత గుట్కా, హన్స్, పాకెట్స్ విక్రయించినచో, వారిపై, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

# తల్లి బిడ్డ ఆరోగ్యం కోసమే సంపూర్ణ పౌష్టికాహార పథకం

తుని తుని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరు సుధా బాలు గృహమునందు తుని రూరల్ అండ్ అర్బన్ ఐ సి డి ఎస్ పరిధిలో గల బాలింతలు గర్భిణీలు చిన్నారులకు పౌష్టికాహార ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరు బాలు సుధారాణి హాజరై పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రూపొందించిన సంక్షేమ పథకాలలో ఎక్కువ మహిళలకు కేటాయించ పడ్డాయని ముఖ్యమంత్రి ప్రకటించిన పథకాలే కాకుండా మరిన్ని కొత్త పథకాలు కూడా నెరవేర్చారని అన్ని వర్గాల వారిని పార్టీతో ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అదేవిధంగా అధికారులకు సూచనలు ఇవ్వబడ్డాయి అని రానున్న రోజులలో సంక్షేమానికి పెద్దపీట వేస్తారని చాలా రాష్ట్రాలు మన సంక్షేమ పథకాల వైపు మొగ్గు చూపుతున్నాయని అన్నారు మన శాసన సభ్యులు దాడిశెట్టి రాజా గారి పాలనలో కుల మత భేదంసమన్యాయం జరుగుతుందని తుని నియోజకవర్గ పరిధిలోని పట్టణ పరిధిలోని నాయకులంతా రాజా గారి నాయకత్వంలో కష్టపడి పని చేస్తున్నారని అని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు అర్బన్ సిడిపిఓ కె నాగలక్ష్మి రూరల్ సి డి పి ఓ టి ఆర్ పద్మావతి సూపర్వైజర్లు లక్ష్మీ సత్యనారాయణ అమ్మ కృష్ణ కుమారి విజయలక్ష్మి, రవణమ్మ, వైసిపి నాయకురాలు శేషకుమారి తదితరులు పాల్గొన్నారు.

# తెల్లజుట్టును నల్లజుట్టుగా మార్చుకోవచ్చిలా..!



హైదరాబాద్, : మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల తోపాటు కాలుష్యం కారణంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాము. అటువంటి వాటిలో తెల్లజుట్టు సమస్య కూడా ఒకటి. వయసుతో సంబంధం లేకుండా అందరినీ తెల్లజుట్టు సమస్య వేధిస్తుంటుంది. యువత కూడా దీని బారిన పడి చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అందుకే ఇప్పుడు మనం కొన్ని సహజసిద్ధమైన పద్దతులను ఉపయోగించి తెల్లజుట్టు సమస్యను పరిష్కరించుకోవచ్చు.. అదెలాగంటే.!ఉసిరికాయ జుట్టుకు ఎంతో మంచిది. ఉసిరికాయ పొడిలో మెంతి పొడి వేసి ఈ రెండింటిని కలిపి నీళ్లు వేసి పేస్ట్ లాగ చేసుకోవాలి. రాత్రిపూట పడుకునే సమయంలో ఈ పేస్ట్ ను మాస్క్ లాగా వేసుకుని ఉదయం వరకు అలాగే వదిలేసి ఉదయం లేచిన తర్వాత తలస్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల వాటిలోని పోషకాలు జుట్టుకు పట్టడమేకాకుండా మీ జుట్టు తెల్లగా మారకుండా కాపాడుతాయి.అలాగే కరివేపాకు కూడా మన జుట్టు సంరక్షణకు బాగా ఉపయోగపడుతుంది. కొబ్బరి నూనెలో కరివేపాకు వేసి బాగా మరిగించి తర్వాత వాడకట్టుకోవాలి. ఈ నూనెను రాత్రి సమయంలో తలకు బాగా రాసుకుని మసాజ్ చేసి ఉదయాన్నే తలస్నానం చేస్తే మీ జుట్టుకు తగిన పోషకాలు లభించి జుట్టు సమస్యలు మెల్లగా తగ్గుతాయి.

# పిల్లలు తినకుండా మారం చేస్తున్నారా..?



చిన్న పిల్లలకు అన్నం తినిపించాలని అంటే పేరెంట్స్ కి తల ప్రాణం తొక్కకి వస్తుంది. ఇక పిల్లలు ఫుడ్ తినడానికి మారం చేస్తారు. కానీ వారు వద్దు అన్నారని అలానే వదిలేస్తే వారికీ కావలసిన పోషకాలు అందవు. పోషకాలు సరిగ్గా అందకపోతే ఎదుగుదల సరిగ్గా ఉండదు. అందుకే పిల్లలకు కష్టమైన కూడా తినిపించాలి. ఇప్పుడు తినిపిస్తేనే పెద్ద అయ్యాక కూడా ఏవ్ అలవాట్లు పాటిస్తారు. కొన్ని టిప్స్ పాటిస్తే పిల్లలకు ఈజీగా తినిపించవచ్చు.ఇక రోజు ఒకే సమయానికి ఫుడ్ తినిపించాలి. అలా కాకుండా రోజంతా ఏదో ఒకటి తినిపిస్తూ ఉండకూడదు. లంచ్, స్నాక్స్ మధ్యలో పండ్లు కానీ, జ్యూస్ కానీ ఇవ్వవచ్చు. అంతేకాదు ఆకలిగా లేదు అన్నప్పుడు తినిపించకూడదు. బలవంతంగా తినిపించడం కానీ.. తింటే లంచం ఇస్తామని చెప్పడం కానీ చేయకూడదు. ఇలా చేయడం వల్ల వాళ్లకు ఆహారం అంటే వ్యతిరేక భావన ఏర్పడడంతో పాటు ఇంకా లంచం ఇస్తారని తినడం అలవాటు అవుతుంది.అయితే వాళ్లకు చిన్నప్పుడు నుండే కొత్త కొత్త ఫుడ్స్ అలవాటు చేయడం మంచిది. వాళ్లకు వేరుగా వండడం వంటివి చేయకూడదు. అందరితో కలిసి వాళ్లకు కూడా వండి పెట్టండి. అందరితో పాటు భోజనం చేసే అలవాటు చెయ్యాలి. మీ పిల్లలు మంచిగా తినాలంటే ముందుగా మీరు హెల్దీ ఫుడ్ తీసుకోవాలి. భోజనం చేసే సమయంలో పిల్లలకు టివి చూసే అలవాటు చేయకూడదు.కాగా.. పిల్లల్ని తినమని ఎక్కువగా బలవంతం చేయకూడదు. ఏది ఎప్పుడు తినాలో ప్రేమగా చెప్పాలి. అంతేగానీ కోపంగా చెప్పకూడదు. ఒకవేళ అలా చేస్తే వాళ్లలో మొండితనం పెరుగుతుంది. అలాగే వాళ్లు ఏడ్చేటపుడు ఎటువంటి ఆహారపదార్థాలూ తినిపించకూడదు.

# టీ20 వరల్డ్‌కప్ నిర్వహణకు.. రేసులో శ్రీలంక



న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌ను యూఏఈలో నిర్వహించాలన్న ఉద్దేశంతో ఎమిరేట్స్ క్రికెట్ క్లబ్‌తో బీసీసీఐ మంతనాలు జరుపుతున్న విషయం తెలిసిందే. అయితే శ్రీలంక క్రికెట్ కూడా ఆ టోర్నీ నిర్వహించేందుకు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. బీసీసీఐతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు ఓ మీడియా సంస్థ ద్వారా వెల్లడైంది. యూఏఈలో ఇప్పటికే ఐపీఎల్ మిగితా మ్యాచ్‌లను నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడే మళ్లీ వరల్డ్‌కప్ నిర్వహించడం సాధ్యమా అన్న కోణంలో ఆలోచనలు చేస్తున్నారు. యూఏఈలో కేవలం షార్జా, దుబాయ్, అబు దాబిల్లో మాత్రమే స్టేడియాలు ఉన్నాయని, కానీ కొలంబోలో పట్ణంలోనూ మూడు స్టేడియాలు ఉన్నట్లు ఒకరు తెలిపారు. సెప్టెంబర్‌లో ఐపీఎల్ నిర్వహణకు తాము కూడా సిద్ధమే అని ఇటీవల శ్రీలంక క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. ఒకవేళ టీ20 వరల్డ్‌కప్‌ను బయట నిర్వహించాలనుకుంటే, అప్పుడు పన్ను మినహాయింపు కోసం ఐసీసీని సంప్రదించాల్సి ఉంటుందని, జూన్ 15వ తేదీలోగా ఆ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, ఈవెంట్ నిర్వహణ కోసం ఐసీసీకి జూన్ 28వ తేదీలోగా చెప్పాల్సి ఉంటుందని కొన్ని వర్గాల ద్వారా వెల్లడైంది.

# "ప్రేమ్ కుమార్" గా 'ఏక్ మినీ కథ' హీరో..!




'వర్షం' దర్శకుడు శోభన్ కుమారుడు సంతోష్ శోభన్ "పేపర్ బాయ్" సినిమాతో హీరోగా పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల "ఏక్ మినీ 'కథ" సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. డైరెక్ట్ ఓటీటీ వేదికగా విడుదలైన ఈ చిత్రం మంచి ఆదరణ దక్కించుకోవడమే కాకుండా.. యువ హీరో నటనకు మంచి మార్కులు పడ్డాయి. బోల్డ్ కథలో ఆత్మనూన్యతా భావం గల యువకుడిగా సంతోష్ శోభన్ నటన ప్రేక్షకులను మెప్పించింది. ఈ నేపథ్యంలో తాజాగా "ప్రేమ్ కుమార్" అనే టైటిల్ తో తన కొత్త సినిమాని ప్రకటించాడు.అభిషేక్ మహర్షి దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో రాశీ సింగ్ హీరోయిన్ గా నటిస్తోంది. సారంగ ఎంటర్టైన్మెంట్స్ ప్రై.లి. పతాకంపై శివప్రసాద్ పన్నీరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈరోజు శుక్రవారం ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించడంతో పాటు టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. పెళ్లి కొడుకు గెటప్ లో చేతిలో తాళి పట్టుకొని భూతద్దంలో చూస్తున్న సంతోష్ శోభన్ కార్టూన్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. పెళ్లి సమస్యతో సతమతమయ్యే అబ్బాయిగా.. అందర్నీ నవ్వించబోతున్నాడని తెలుస్తోంది.సాధారణంగా తెలుగు సినిమా క్లైమాక్స్ లో హీరో వచ్చి కొన్ని భారీ సెంటిమెంట్ డైలాగ్స్ చెప్పి హీరోయిన్ ను పెళ్లి చేసుకుంతాడు. కానీ అప్పుడు పెళ్లి పీటల మీద కూర్చున్న పెళ్లికొడుకును మాత్రం ఎవరూ పట్టించుకోరు. అటువంటి ఓ పెళ్లికొడుకు తనకు పెళ్లి అవ్వడం లేదనే ఫ్రస్టేషన్ లో ఏం చేశాడనేది "ప్రేమ్ కుమార్" సినిమా అని చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే 80 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. లాక్ డౌన్ తర్వాత మిగతా భాగం షూట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంతో కృష్ణచైతన్య - రుచిత సాధినేని - కృష్ణతేజ - సుదర్శన్ - అశోక్ కుమార్ - ప్రభావతి - మధు తదితరులు నటిస్తున్నారు.'ప్రేమ్ కుమార్' చిత్రానికి దర్శకుడు అభిషేక్ మహర్షి - రచయిత అనిరుధ్ కృష్ణమూర్తి కలిసి కథ అందించారు. అనంత్ శ్రీకర్ సంగీతం సమకూర్చగా.. కిట్టు విస్సాప్రగడ పాటలు రాస్తున్నారు. రాంపీ నందిగాం సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి గ్యారీ బీహెచ్ ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. కొత్త తరహా కాన్సెప్టులు ఎంచుకుంటున్న యంగ్ హీరో సంతోష్ శోభన్ కు 'ప్రేమ్ కుమార్' ఎలాంటి విజయాన్ని అందిస్తాడో చూడాలి.

# థింక్ ట్వైస్! రాధే ఫార్మాట్ రాధేశ్యామ్ కి కలిసొస్తుందేమో!?




బాలీవుడ్ లో సల్మాన్ భాయ్ డేర్ డెవిల్ స్టెప్ గురించి తెలిసిందే. రాధే - మోస్ట్ వాంటెడ్ భాయ్ చిత్రాన్ని ఓటీటీ సహా థియేటర్లలో సైమల్టేనియస్ గా రిలీజ్ చేశారు. పే-పర్ వ్యూ విధానాన్ని అనుసరించారు. కానీ భాయ్ సాహసం చేసినా ఆ ఫార్మాట్ పూర్తిగా ఫెయిలైంది. దీంతో అదే బాటను అనుసరించాలనుకున్న చాలా మంది ఆలోచనలు మారిపోయాయి.ఇటీవల రాధే ఫార్మాట్ లోనే రాధేశ్యామ్ కూడా రిలీజైపోతుందని ప్రభాస్ అండ్ టీమ్ అందుకు సన్నాహకాల్లో ఉన్నారని తామరతంపరగా కథనాలొచ్చాయి. రాధేశ్యామ్ హైబ్రిడ్ విడుదలకు రెడీ అవుతోందనే వార్తలు వచ్చాయి. ఇా లో పే-పర్ వ్యూతో పాటు విదేశాలలో పెద్ద స్క్రీన్లలోనూ విడుదలవుతుందని టాక్ వినిపించింది.నిర్మాతలకు ఓటీటీ ల నుంచి చాలా ఆఫర్లు వచ్చాయి. కానీ యువి క్రియేషన్స్ ప్రభాస్ అండ్ టీమ్ అటువంటి ప్రణాళికల్లో లేరు. పెద్ద స్క్రీన్ విడుదలను మాత్రమే వేచి చూసే ధోరణిలో ఉన్నారు. రాధే శ్యామ్ పెద్ద స్క్రీన్లలో మాత్రమే చూడాల్సిన సినిమా.. అందుకే థియేటర్లు తెరిచే సరైన సమయం కోసం ఎంతకాలమైనా ఎదురుచూడాలని భావిస్తున్నారట.నిజానికి రాధే ఫార్మాట్ ని మరో కోణంలోనూ కొందరు అభిమానులు విశ్లేషిస్తున్నారు. రాధే లో కంటెంట్ లేక ఫోయిలైంది. రాధేశ్యామ్ కంటెంట్ తో హిట్టు కొడుతుందేమో చెప్పలేం. రాధే ఫార్మాట్ రాధేకి కలిసి రాకపోయినా రాధేశ్యామ్ కి కలిసి రావొచ్చేమో!! థింక్ ట్వైస్ అని కొత్త డౌట్లు పెట్టేసే అభిమానులు లేకపోలేదు. ఈ రోజుల్లో కంటెంటే దేనినైనా నడిపిస్తోంది కదా! అని కొందరు వాదిస్తున్నారు. మరి ఈ వాదాన్ని యువి బ్యానర్ పరిశీలిస్తుందేమో చూడాలి. ప్రభాస్ తదుపరి సలార్ - ఆదిపురుష్ 3డి చిత్రీకరణలతో బిజీ అవుతున్న సంగతి తెలిసిందే. నాగ్ అశ్విన్ తో సైన్స్ ఫిక్షన్ మూవీని త్వరలోనే ప్రారంభించే యోచన చేస్తున్నారు.

# నలుగురు హీరోయిన్లతో రొమాన్స్.. విశ్వక్ సేన్ న్యూ మూవీ!



తెలుగు ఇండస్ట్రీలో యువహీరోల హవా మాములుగా లేదు. అలా దూసుకుపోతున్న యువహీరోలలో విశ్వక్ సేన్ ఒకరు. వెళ్ళిపోమాకే సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన విశ్వక్.. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో ఇండస్ట్రీలో హీరోగా ఫస్ట్ సక్సెస్ అందుకున్నాడు. ఆ తర్వాత సొంతంగా డైరెక్షన్ చేసి 'ఫలక్ నుమా దాస్' సినిమాను రూపొందించాడు. ఆ సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర హిట్ అవ్వడంతో యూత్ లో ఈ హీరోకు మంచి క్రేజ్ క్రియేట్ అయింది. పక్కా హైదరాబాద్ యాసలో తీసిన ఫలక్ నుమా దాస్ సినిమాతో తనని తను నిరూపించుకున్న విశ్వక్.. ప్రస్తుతం వరుసగా సినిమాలు ప్రకటిస్తున్నాడు.విశ్వక్ చివరిగా కొత్త డైరెక్టర్ శైలేంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన 'హిట్' సినిమాతో వచ్చాడు. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద హిట్ అవ్వడంతో విశ్వక్ తదుపరి సినిమాల సంఖ్య పెరిగిపోయింది. అందుకే ఇప్పుడు చేతిలో తెలుగు సినిమాలతో పాటు రీమేక్ సినిమాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం విశ్వక్.. నరేష్ అనే నూతన దర్శకుడితో పాగల్ అనే సినిమా చేస్తున్నాడు. రొమాంటిక్ లవ్ స్టోరీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీ త్వరలో రిలీజ్ అయ్యేందుకు సిద్ధం అవుతోంది. అయితే తాజా సమాచారం ప్రకారం.. విశ్వక్ కప్పేలా అనే మలయాళం రీమేక్ తో పాటు 'ఓ మై కడవులే' అనే తమిళ మూవీ రీమేక్ కూడా చేస్తున్నాడు.ఇదిలా ఉండగా.. విశ్వక్ గుట్టుచప్పుడు కాకుండా స్టార్ డైరెక్టర్ తో ఓ హారర్ థ్రిల్లర్ మూవీ లైన్ లో పెట్టేసాడు. ఆ సినిమా కూడా సెకండ్ వేవ్ లాక్డౌన్ ముందే 90% షూటింగ్ కంప్లీట్ అయినట్లు సమాచారం. ఆశ్చర్యం అనిపిస్తున్నా నమ్మకతప్పదు. ఈ యంగ్ హీరో 'అక్టోబర్ 31 - లేడీస్ నైట్' అనే ద్విభాషా చిత్రంలో నటిస్తున్నాడు. హారర్ నేపథ్యంలో ఫస్ట్ హాలోవీన్ మూవీగా ఇది రాబోతుంది. అయితే ఈ సినిమాను 'తలైవి' ఫేమ్ డైరెక్టర్ ఏఎల్ విజయ్ తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాలో విశ్వక్ సరసన ఏకంగా నలుగురు కుర్రహీరోయిన్స్ రొమాన్స్ చేయనున్నారు. మేఘాఆకాష్ - మంజిమమోహన్ - రెబ్బా మౌనిక జాన్ - నివేదా పేతురాజ్ హీరోయిన్స్ కాగా.. ఈ సినిమాను త్రిపుర ఫేమ్ ఎం. రాజశేఖర్ నిర్మిస్తున్నారు. లాక్డౌన్ కారణంగా ఈ సినిమాను సీక్రెట్ గా ఉంచినట్లు ఇండస్ట్రీవర్గాలు చెబుతున్నాయి. చూడాలి మరి విశ్వక్ సేన్ తమిళ డెబ్యూ ఎలా జరగబోతుందో..!

# వర్మ హీరోగా నటించే సినిమాలో అరియానా కథానాయిక?



దశాబ్దాల కెరీర్ జర్నీలో ఎందరో కథానాయికల్ని తనదైన పబ్లిసిటీ స్టంట్ తో పాపులర్ చేసిన ఆర్జీవీ .. నేటికీ యువతరం కథానాయికల్ని అదే పనిగా ప్రమోట్ చేసేందుకు వెనకాడడం లేదు. ఆర్జీవీ డీకంపెనీలో చేరితే చాలు ఆటోమెటిగ్గా పబ్లిసిటీ ఫ్రీ. ఇటీవల ఓ ఇద్దరు హాట్ గాళ్స్ కి అద్భుతమైన ప్రచారాన్ని కల్పిస్తున్న ఆర్జీవీ ఇప్పుడు బిగ్ బాస్ బ్యూటీ అరియానాకు కావాల్సినంత ప్రమోషన్ తెస్తున్నారు.నిజానికి బిగ్ బాస్ ఇంటికి వెళ్లకముందు అరియానా ఓ ఇంటర్వ్యూ కోసం ఆర్జీవీని కలిసారు. అప్పట్లో అరియానా డ్రెస్సింగ్ సెన్స్ థై సొగసులపై ఆర్జీవీ చేసిన కామెంట్ సంచలనమే అయ్యింది. ఆ తర్వాతే అరియానా ఎవరో బయటి ప్రపంచానికి తెలిసింది. బిగ్ బాస్ ఇంటి సభ్యురాలిగా మరింత పాపులారిటీ తెచ్చుకుంది. అరియానా కోసం బిగ్ బాస్ చూసిన ఆర్జీవీ తనకు కావాల్సిన ప్రచారం చేసిన సంగతి తెలిసిందే.అరియానా ప్రస్తుతం పెద్ద తెరపై వెలిగేందుకు తన వంతు ప్రయత్నాల్లో ఉంది. మరోసారి వర్మను ఇంటర్వ్యూ చేసేందుకు అరియానా జిమ్ లో కలిసారు. అయితే ఆర్జీవీ జిమ్ లో ఫుల్ బిజీగా ఉన్నారు. తాను జిమ్ చేయడమే గాక అరియానాకు కసరత్తులు నేర్పించారు. అందుకు సంబంధించిన ఓ ఫోటోని ఆయన స్వయంగా షేర్ చేశారు. వర్మ తొందర్లోనే హీరో అవుతున్న సంగతి తెలిసిందే. చూస్తుంటే ఆ చిత్రంలో అరియానాకు కథానాయికగా అవకాశం ఇచ్చేశారేమోననే డౌట్లు పుట్టుకొస్తున్నాయి. ఇకపోతే జిమ్ లో అరియానా ఫుల్ ఫోటోషూట్ ని కూడా వర్మ త్వరలోనే రిలీజ్ చేస్తారట.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190